## కోర్టుకు ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టు

హైదరాబాద్, ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను రవి కొనుగోలు చేశారు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు అతడి ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు. ఇక రాకేష్ అనే వ్యక్తి ద్వారా ట్రేడ్ మార్క్ లైసెన్స్, బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన నగదుతో రవి జల్సాలు చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోనే రవి ఆఫీస్ నడిపినట్లు కస్టడీ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. దాదాపు 12 రోజుల కస్టడీ అనంతరం మంగళవారం అతడిని జైలుకు పోలీసులు తరలించారు. ఈ కస్టడీలో ఐ బొమ్మ రవి కీలక అంశాలు వెల్లడించారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :265 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 02-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## బెంగళూరు సెలబ్రేషన్స్.. మద్యం మత్తులో యువతుల రచ్చ



న్యూ ఇయర్ అంటే యూత్ కు పండుగే.. నిన్న 31 డిసెంబర్ రాత్రి పార్టీలు, పబ్బులు, విందులు వినోదాల్లో మునిగిపోయారు. మందు విందుతో ఎంజాయ్ చేశారు. ఇంకా ఆ హ్యాంగోవర్ కూడా దిగలేదు. అయితే ఐటీ సిటీ బెంగళూరులో మాత్రం తాగి యువతులు చేసిన రచ్చ మాత్రం మామూలుగా లేదు. వారి రచ్చ రంబోలాకు పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకురావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.న్యూ ఇయర్ కు స్వాగతం పలుకుతూ ఐటీ సిటీ బెంగళూరు మిరుమిట్లు గొలిపే కాంతులతో మెరిసిపోయింది. అయితే ఈ వేడుకల వెనుక మద్యం మత్తులో కొందరు చేసిన హంగామా నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. పబ్ లు, రోడ్లపై యువతీ యువకులు హద్దులు దాటి ప్రవర్తించడంతో సిలికాన్ వ్యాలీ వీధులు కాస్తా గొడవలకు నిలయంగా మారాయి.

ఒపెరా రోడ్డులో 'ప్రియుడి'పై ప్రియురాలి దాడి

నగరంలోని అత్యంత రద్దీగా ఉండే ఒపెరా రోడ్డులో ఒక వింత పరిస్థితి నెలకొంది. మద్యం మత్తులో ఉన్న ఓ యువతి తన ప్రియుడితో గొడవకు దిగడమే కాకుండా.. బహిరంగంగానే అతనిపై దాడికి పాల్పడింది. వీరి గొడవను ఆపేందుకు ప్రయత్నించిన స్థానికులు, వాహనదారులపై కూడా ఆమె విచక్షణారహితంగా విరుచుకుపడింది. దీంతో అక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వడమే కాకుండా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగ ప్రవేశం చేసిన పోలీసులు.. సదరు యువతిని అతికష్టం మీద శాంతింపజేసి అక్కడి నుండి తరలించారు.

కోరమంగళ పబ్ లో ముష్టియుద్ధం

యూత్ అడ్డాగా పేరున్న కోరమంగళ ప్రాంతంలోని ఓ పబ్ లో మద్యం మత్తులో ఇద్దరు యువకులు రెచ్చిపోయారు. చిన్న మాట పట్టింపు కాస్తా పెద్ద గొడవకు దారితీయడంతో ఇద్దరూ పరస్పరం పిడిగుద్దులు కురిపించుకున్నారు. పబ్ లోపల ఉన్న ఫర్నిచర్ ధ్వంసం అవ్వడంతో భయపడిన ఇతర కస్టమర్లు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు పబ్ లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

పటాకుల రచ్చ.. తప్పని లాఠీఛార్జ్

మరోవైపు కొందరు యువకులు మద్యం మత్తులో రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బంది కలిగేలా పటాకులు కాల్చుతూ రచ్చ చేశారు. పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారు వినకపోవడంతో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. పోలీసుల దెబ్బకు రచ్చ చేస్తున్న గుంపు చెల్లాచెదురైపోయింది.

మత్తులో యువతి.. ఆటోలో పంపిన ఖాకీలు..

మరో ప్రాంతంలో పూర్తిగా మద్యం సేవించి స్పృహ కోల్పోయిన స్థితిలో ఉన్న ఓ యువతిని చూసిన మహిళా పోలీసులు.. ఆమె భద్రత దృష్ట్యా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆమెను సురక్షితంగా ఆటోలో ఎక్కించి ఇంటికి పంపించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

పోలీసుల హెచ్చరిక

న్యూ ఇయర్ వేడుకల దృష్ట్యా బెంగళూరు పోలీసులు నగరం అంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనలపై స్పందించిన ఉన్నతాధికారులు.. "వేడుకలు జరుపుకోవడం తప్పు కాదు.. కానీ అది ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఉండకూడదు. హద్దులు దాటి ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.మొత్తానికి బెంగళూరులో నూతన సంవత్సర వేడుకలు ఒకవైపు ఆనందంగా సాగినా, మరోవైపు ఈ మద్యం గొడవలు కలకలం రేపాయి.

## అసెంబ్లీకి కేసీఆర్? అస్త్ర శస్త్రాలతో సమరానికి సై!



హైదరాబాద్, సార్ సభకు వస్తారా రారా. అటు బీఆర్ఎస్‌లో..ఇటు కాంగ్రెస్‌లో ఇదే చర్చ. గులాబీ దళపతి మాత్రం సభకు వస్తా..అధికార పార్టీకి ఇచ్చిపడేస్తానంటున్నారు. కారు పార్టీ లీడర్లు మాత్రం కన్‌ఫ్యూజన్‌లో ఉన్నారట.సార్ సభకు వస్తే..అధికార పార్టీ నేతలు ఆయనను పర్సనల్‌గా అటాక్ చేస్తారేమో..దళపతిని తక్కువ చేసి మాట్లాడుతారేమోనని మధన పడుతున్నారట. కేసీఆర్ మాత్రం ఎట్లైతే గట్లాయే..ఈ సారి మునుపటి లెక్క ఉండదు. దేనికైనా రెడీ..తగ్గేదేలే అంటున్నారట. అధికార పక్షం దాడిని గులాబీ బాస్ ఎలా ఎదుర్కోబోతున్నారు.? కేసీఆర్ దగ్గరున్న అసెంబ్లీ అస్త్రం ఏమిటి.?అది బహిరంగ సభ అయినా..మీడియా సమావేశం అయినా..చిట్ చాట్ అయినా..సందర్భమేదైనా మాజీ సీఎం కేసీఆర్ పేరు ఎత్తకుండా సీఎం రేవంత్ రెడ్డి ఉండలేరు. పోనీ కేసీఆర్ పేరు తీసుకుని వదిలేస్తారా అంటే..ఎడాపెడా మాటలు తూటాలు పేలుస్తారు. బహిరంగ సభలు, మీడియా సమావేశాల్లో కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతున్న మాటలకు ఇప్పటికే బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లు, కేసీఆర్ అభిమానులు హర్ట్ అవుతున్నారట.అలాంటిది కేసీఆర్ అసెంబ్లీకి వస్తే..వివిధ అంశాలపై చర్చ సందర్భంగా కేసీఆర్‌పై నోరుజారకుండా ఉంటారా.? ఇదే ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను ఆందోళనకు గురిచేస్తున్న అంశమట. కేసీఆర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి రావాలని సవాల్ విసురుతున్నారని డౌట్ పడుతున్నారట బీఆర్ఎస్ లీడర్లు. బాస్ సభకు వెళ్తే మంచిదా.? లేకపోతే ప్రెస్‌మీట్లకే పరిమితమైతే బెటరా అనే డైలమాలో ఉన్నారట కారు పార్టీ ముఖ్యనేతలు.శుక్రవారం నుంచి సభ కంటిన్యూగా జరగనుంది. 2వ తేదీ నుంచి జరిగే సమావేశాలకు గులాబీ బాస్ హాజరవుతారన్న టాక్ వినిపిస్తోంది. దీంతో ఈ సారి అసెంబ్లీ సెషన్ రసవత్తరంగా జరగనుందని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ సభకు వచ్చి చర్చల్లో పాల్గొంటారన్న ప్రచారం సామాన్య జనంలో క్యూరియాసిటీని పెంచుతోంది.

గులాబీ లీడర్ల ఆందోళన

అయితే కేసీఆర్ అసెంబ్లీకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయోనన్నదానిపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కేసీఆర్ గౌరవానికి సభలో భంగం వాటిల్లే ఛాన్స్ ఉందని గులాబీ పార్టీ ముఖ్యనేతలు ఆవేదన చెందుతున్నట్లు తెలంగాణ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కారు పార్టీ లీడర్ల ఆందోళనకు సీఎం రేవంత్ రెడ్డి మాట తీరే కారణమంటున్నారు.కేసీఆర్ పేరు వింటేనే సీఎం రేవంత్ రెడ్డి ఒంటికాలిపై లేస్తున్నారు. కేసీఆర్ పేరును ప్రస్తావించి మరీ విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు సీఎం. అంశం ఏదైనా కేసీఆర్ పేరును ప్రస్తావించి తీవ్రస్థాయిలో మండిపడుతూ వస్తున్నారు రేవంత్. అయితే సీఎం అడ్డూ అదుపు లేకుండా..కేసీఆర్‌ను విమర్శిస్తే ఆయన గౌరవానికి భంగం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు కంగారు పడుతున్నారట.రేవంత్‌కు కౌంటర్ ఇచ్చేందుకు మైక్ కట్ చేయకుండా కేసీఆర్‌కు మాట్లాడే అవకాశం ఇస్తారా లేరా అన్న డౌట్ కూడా వ్యక్తం చేస్తున్నారు గులాబీ పార్టీ నేతలు. కేసీఆర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి రావాలని పదే పదే సవాల్ విసురుతున్నారని, అందుకే బాస్ సభకు వెళ్తే బావుంటుందా..వెళ్లకపోవడమే మంచిదా అన్న ఊగిసలాటలో ఉన్నారట కారు పార్టీ లీడర్లు.

కేసీఆర్ హాజరుపై నో క్లారిటీ

అయితే కేసీఆర్ సభకు హాజరుపై పూర్తిస్థాయిలో క్లారిటీ లేదు. నందినగర్ నివాసం నుంచి సార్ ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు. దీంతో సభకు వస్తారా రారా అన్నది డౌటే. కానీ సభకు హాజరైతే మాత్రం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.తనను అవమానించేలా మాట్లాడినా..అధికార పక్షం నేతలు నోరు జారినా..ఎక్కడా టెంప్ట్ కావొద్దని బీఆర్ఎస్ లీడర్లకు ఇండైరెక్ట్‌గా డైరెక్షన్స్ ఇచ్చారట. ఒకవేళ కాంగ్రెస్ నేతలు స్థాయి దిగజారి..తన పరువుకు నష్టం కలిగించేలా బిహేవ్ చేస్తే ఏం చేయాలో..తనకు తెలుసు అన్నట్లుగా నేతలతో చెప్పుకొచ్చారట కేసీఆర్.సభకు రావాలంటూ సవాల్ విసిరి..వ్యక్తిగత విమర్శలు చేశారని ఎక్స్‌పోజ్ చేసి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయాలనే వ్యూహం కూడా ఉందట. అందుకే ఈ సారి పరీక్ష మనకు కాదు..అధికార పక్షానికే అంటున్నారట గులాబీ బాస్. వాళ్ల ఓపిక..తీరిక..మనమ్ మాత్రం సబ్జెక్ట్ తోనే కొడుతాం..పాయింట్ టు పాయింట్ మాట్లాడుతాం..ఎవరేంటో ప్రజలే డిసైడ్ చేస్తారు..డోంట్ వర్రీ అంటూ లీడర్లకు దిశానిర్దేశం చేశారట కేసీఆర్. సార్ సభకు వెళ్తే చర్చలు..వాగ్వాదాలు ఎలా ఉంటాయో చూడాలి మరి.

## 2025లో అవినీతిపై గట్టి దెబ్బ : అవినీతి తిమింగాల గుండెల్లో వణుకు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన దిశగా 2025 సంవత్సరం ఒక మైలురాయిగా నిలిచింది. యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) ఈ ఏడాది ప్రదర్శించిన దూకుడు.. అవినీతి తిమింగాల గుండెల్లో వణుకు పుట్టించాడు. గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొత్తం 199 అవినీతి కేసులు నమోదు చేసింది. సగటున ప్రతి రెండు రోజులకు ఒక అవినీతి కేసు నమోదు చేస్తూ.. ఈ కేసుల్లో 273 మందిని అరెస్ట్ చేయడం.. వ్యవస్థను ప్రక్షాలన చేయడంలో ఏసీబీ అదుతేమైన పనితీరు కనబరిచింది.

ట్రాప్ కేసుల్లో అధిక భాగస్వామ్యం..

అవినీతిని అడ్డుకునే ప్రధాన ఆయుధమైన ట్రాప్ కేసులు ఈ ఏడాది అత్యధికంగా నమోదయ్యాయి. మొత్తం 157 ట్రాప్ కేసుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన 224 మంది అరెస్ట్ అయ్యారు. వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గమనార్హం. ఈ ఆపరేషన్లలో రూ.57 లక్షలకు పైగా లంచం సొమ్ము స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తుల దర్యాప్తులోనూ షాకింగ్ నిజాలు

అవినీతితో కూడిన సంపాదనపై ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. అనుపాతరహిత ఆస్తుల కేసులు 15 నమోదు చేసి అందులో రూ.96.13 కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి తీసుకొచ్చింది. ఇది పెద్ద స్థాయి అవినీతిని బయటపెట్టిన కీలక విజయం.

అధికారుల దుర్వినియోగంపై చర్యలు

ఇంకా 26 తీవ్రమైన దుర్వినియోగ కేసులు నమోదు చేయగా.. అందులో 34 మంది అరెస్ట్ అయ్యారు. అవినీతిని ముందే అడ్డుకునే లక్ష్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు.. ఆర్టీఏ చెక్ పోస్టులు, సంక్షేమ హాస్టళ్లు వంటి చోట్ల 54 సడెన్ చెక్స్ నిర్వహించారు.

న్యాయ ప్రక్రియలో వేగం..

కేసులపై న్యాయపరమైన చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది 115 కేసుల్లో నిందితులపై కేసులు నడిపేందుకు ప్రభుత్వ అనుమతి పొందగా.. సంబంధిత చార్జ్ షీట్లు దాఖలు చేశారు.



ఆధునిక శిక్షణ, టెక్నాలజీ వినియోగం..

ఏసీబీ సిబ్బంది సామర్థ్యాన్ని పెంచేందుకు 73 మంది కొత్త అధికారులకు శిక్షణ ఇచ్చారు. దాని ఉన్న ఆస్తుల గుర్తింపు.. మనీ ట్రైల్స్ ట్రాకింగ్, డిజిటల్ ఆధారాల వినియోగం వంటి ఆధునిక పద్ధతులపై ప్రత్యేక శిక్షణ అందించారు.

ప్రజలకు చేరువైన ఫిర్యాదు వ్యవస్థ

అవినీతి ఫిర్యాదులు సులభంగా నమోదు చేయాలనే ఉద్దేశంతో డిసెంబర్ 3–9 మధ్య నిర్వహించిన యాంటీ కరప్షన్ వీక్ సందర్భంగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫిర్యాదు వ్యవస్థను ప్రారంభించారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మధ్యవర్తులు లేకుండా సురక్షితంగా ఫిర్యాదు చేయవచ్చు. అదనంగా పోస్టర్లు , విద్యార్థుల కోసం వ్యాసపోటీలు .. ర్యాలీలు, బహుమతి పంపిణీ కార్యక్రమాల ద్వారా అవగాహన పెంచారు. పౌరులు ట్రోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్, లేదా నేరుగా ఏసీబీ కార్యాలయాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.ఈ విజయాల వెనుక చారుసిన్హా, ఐపీఎస్, డైరెక్టర్ జనరల్ గా ఉన్న ఏసీబీ బృందం నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. 2025లో సాధించిన ఈ ఫలితాలు తెలంగాణలో అవినీతికి తావులేని పారదర్శక పాలన దిశగా రాష్ట్రం ముందడుగు వేస్తోందని స్పష్టంగా సూచిస్తున్నాయి.

## రూ.1.48 కోట్ల ఫ్లాట్, రూ.20,552 నగదు.. ఆస్తి వివరాలు ప్రకటించిన బీహార్ సీఎం



పాట్నా:2025 ఏడాది ముగింపు సందర్భంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన ఆస్తి వివరాలను వెల్లడించారు సీఎంతోపాటూ క్యాబినెట్ మంత్రులు కూడా తమ ఆస్తులను ప్రకటించారు. ఈ వివరాలను క్యాబినెట్ సెక్రటేరియట్ విభాగం తాజాగా విడుదల చేసింది.ఆ వివరాల ప్రకారం.. సీఎం నితీశ్ కుమార్‌కు ద్వారకలోని బీహార్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓ ఫ్లాట్ ఉంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 1.48 కోట్లు. ఇక తన వద్ద రూ. 20,552 నగదు ఉన్నట్లు సీఎం తెలిపారు. అంతేకాదు సీఎం మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాట్నా సెక్రటేరియట్ ఖాతాలో రూ. 27,217, ఢిల్లీలోని తన ఎస్‌బీఐ పార్లమెంటరీ హౌస్ ఖాతాలో రూ. 3,358, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతాలో రూ. 27,191 నగదు ఉన్నట్లు సీఎం వెల్లడించారు. ఇక తన వద్ద రూ. 11,32,753 విలువ చేసే ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు, రూ. 2.03 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన మొత్తం చరాస్తుల విలువ రూ. 17,66,196. డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా సహా పలువురు మంత్రులుకూడా తమ ఆస్తి వివరాలను బహిర్గతం చేశారు.

సామ్రాట్ చౌదరి వద్ద రూ.లక్షల్లో బంగారం, సేవింగ్స్

ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి .. తన వద్ద రూ. 1.35 లక్షల నగదు, తన భార్య వద్ద రూ. 35,000 నగదు ఉన్నట్లు ప్రకటించారు. వీటితోపాటూ పలు బ్యాంకు ఖాతాల్లో సేవింగ్స్ రూపంలో రూ.లక్షల్లో ఉన్నట్లు తెలిపారు. వాటిలో ఎస్‌బీఐ ఖాతాలో రూ. 15,35,789, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలో రూ. 2,09,688 ఉన్నట్లు వివరించారు. బాండ్లు, షేర్లలో కూడా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. భార్య, కుమార్తె, కొడుకు పేర్లపై బ్యాంకు డిపాజిట్లు కూడా ఉన్నాయి.ఇక సామ్రాట్ చౌదరి వద్ద రూ. 7 లక్షల విలువైన 2023 మోడల్ బొలెరో నియో ఉంది. తన భార్య వద్ద, తన వద్ద కలిసి రూ. 40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, పాట్నాలోని గోలా రోడ్డులో తన భార్య పేరుమీద రూ. 29 లక్షల విలువైన ఫ్లాట్ ఉంది. ఇక సామ్రాట్ చౌదరి వద్ద రూ. 4 లక్షల విలువైన ఎన్‌పీ బోర్ రైఫిల్, ఆయన తండ్రి ఇచ్చిన రూ. 2 లక్షల విలువైన రివాల్వర్ కూడా ఉన్నాయి.మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా .. తన వద్ద రూ. 88,560 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ. 55 లక్షలకుపైగా సేవింగ్స్ ఉన్నట్లు ప్రకటించారు. శివ బయోజెనెటిక్, పవర్ గ్రిడ్ వంటి కంపెనీల్లో షేర్లు సహా ఇతర సంస్థల్లో పెట్టుబడులు, రూ. 9.90 లక్షల విలువైన 90 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ప్రకటించారు. పలువురు మంత్రులు కూడా ఆస్తి వివరాలను ప్రకటించారు.

## న్యూ ఇయర్ దెబ్బకు మద్యం అమ్మకాల్లో కొత్త రికార్డు




హైదరాబాద్ : తెలంగాణ ఎక్సైజ్ శాఖకు డిసెంబర్ నెల ఆదాయం కొత్త రికార్డులను నమోదు చేసింది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పెరిగిన మద్యం అమ్మకాలతో పాటు క్రిస్మస్..గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ నెల మద్యం అమ్మకాలు గత రికార్డులను బద్దలు కొట్టాయి. ఏకంగా 5,050కోట్లకు పైగా మద్యం అమ్మకాలు సాగాయి. 2024డిసెంబర్ నెలతో పోల్చితే 1349కోట్లు ఎక్కువగా మద్యం అమ్మకాలు జరుగడం విశేషం. రికార్డు స్థాయిలో జరిగిన మద్యం అమ్మకాలు కొత్త మద్యం దుకణాల యాజమానులకు ప్రయోజనకరంగా మారాయి.నూతన సంవత్సరం సందర్భంగా మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. చివరి మూడు రోజుల్లోనే దాదాపు రూ. 1000 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత ఐదు రోజుల్లో రాష్ట్రంలో రూ. 1,350 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో రూ. 520కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 31న 370కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగినట్లుగా ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పూర్తి వివరాలు అందాల్సి ఉందని తెలిపారు.

### పురాతన వస్తువుల విభజన కోసం కొత్త కమిటీ

హైదరాబాద్,ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పురాతన వస్తువుల విభజన కోసం కొత్త కమిటీ ఏర్పాటు అయింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మ్యూజియంలో ఉంచిన పురాతన వస్తువుల విభజన కోసం ఈ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం –2014 నిబంధనల ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వస్తువుల పంపకం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఛైర్ పర్సన్‌గా రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్ పర్సన్ తేజస్వీ పొడపాటి

## చలి గుప్పిట్లో తెలుగు రాష్ట్రాలు...

హైదరాబాద,జనవరి1, ఏపీ, తెలంగాణా రాష్ట్రాలు చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి. ఎన్నడూలేని విధంగా గత నెలరోజుల నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రస్తుతం.. తెలంగాణ వ్యాప్తంగా సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దట్టమైన పొంగమంచు కురియడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లో నూతన సంవత్సరం రోజు మంచుదుప్పటి పరచుకుంది. దీంతో ఉదయం 9 గంటలు దాటినా సూరీడు దర్శనమివ్వలేదు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. కోహిర్, సిర్పూర్ ప్రాంతాల్లో నెల రోజులుగా 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవు తున్నట్లు అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, జనగాం, మెదక్, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత బాగా పెరిగిపోయింది. నగర శివారు ప్రాంతాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అక్కడి ప్రాంతాల్లో 8 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక.. ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో విపరీతమైన చలి ప్రభావం కనిపిస్తోంది. రాబోయే మూడు రోజుల్లో కొస్తాంధ్ర, యానాం, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గే అవకాశమున్నట్లు



వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ తీర ప్రాంతాల్లోనూ కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని ఐఎండీ అంచనా వేస్తోంది. జనవరి 1 తర్వాత వాతావరణంలో చాలా మార్పులు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం కూడా విపరీతంగా చలి తీవ్రత కనిపిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి చల్లటి పవనాలు వీడయడం వల్లనే ఉష్ణోగ్రతలు తగ్గాయని ఐఎండీ పేర్కొంది.

అగ్రనేత



## సంపాదకీయం

**శుక్రవారం 02-01-2026**

## ఆయుధోత్పత్తి లక్ష్యం...

భారతదేశ రక్షణోత్పత్తుల విధానం రూపాంతరం చెందుతోంది. ఈ మేరకు రక్షణ శాఖ 2025ను సంస్కరణల సంవత్సరంగా ప్రకటించింది. ఆయుధ సేకరణలో వ్యూహాత్మక మార్పులు చేపట్టింది. ఆయుధోత్పత్తి రంగంలో ఆత్మనిర్భరత సాధనే లక్ష్యంగా నూతన ఏడాదిలో మరింత వడివడిగా అడుగులు పడాలి. రక్షణ శాఖ ఆయుధ సేకరణ విధానాన్ని (డీఏపీ) మూడు అంచెల వ్యూహంగా రూపుదిద్దింది. ఇంతకాలం, భారత్‌లో విదేశీ సంస్థల భాగస్వామ్యంతో ఆయుధాలను ఉత్పత్తి చేస్తే, వాటిపై మేధాపరమైన, యాజమాన్య పరమైన హక్కులు ఎవరికి చెందుతాయనే మీమాంస ఉండేది. దాన్ని తొలగించడానికి విదేశీ భాగస్వాములను ప్రాథమిక కాంట్రాక్టర్లుగా వర్గీకరించారు. వ్యూహంలో రెండో అంచె కింద రక్షణోత్పత్తులను వేగంగా తయారు చేసి, ఎగుమతి చేయడానికి ప్రాధాన్యమిస్తారు. మూడో అంచె కింద విదేశీ భాగస్వాములు విధిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీ చేయాలనే షరతు విధిస్తారు. విదేశీ సాంకేతికతతో ఇక్కడ తయారయ్యే ఆయుధాలలో భారతీయ విడిభాగాలు, సాంకేతికతలను తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. భారతదేశం 2001లోనే నిర్దిష్ట శాతం విదేశీ యాజమాన్యంతో స్థానికంగా ఆయుధ తయారీకి అనుమతించింది. విదేశీ వాటాను పెంచుతూ వచ్చింది. 2020 వచ్చేసరికి విదేశీ యాజమాన్యాన్ని 74శాతానికి పెంచింది. అత్యాధునిక టెక్నాలజీ వాడే సందరాల్లో దీన్ని నూరు శాతానికి అనుమ తించింది. ఇది వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెట్టిన సందరాలేకు వర్తిస్తుంది. నూరు శాతం పెట్టుబడితో విదేశీ కంపెనీలకు పూర్తి యాజమాన్య హక్కు లభిస్తుంది కాబట్టి, అవి మన దేశానికి ఆధునిక సాంకేతికతలను అందిస్తాయని ఆశించారు. గతంలో ఆయుధోత్పత్తి రంగంలో విదేశీ భాగస్వామ్యం ఎలాంటి ఫలితాలను ఇచ్చిందో ఒకసారి సింహావలోకనం చేసుకుంటే, తాజా విధానంపై ఒక అంచనాకు రావచ్చు.

ఎఫ్‌డీఐలపై ఆశలు వమ్ము

భారతీయ రక్షణ పరిశ్రమల్లోకి 2001–2025 సెప్టెంబరు మధ్యకాలంలో ప్రవహించిన మొత్తం ఎఫ్‌డీఐలు కేవలం 2.65 కోట్ల డాలర్లు మాత్రమే. అందులో 1.64 కోట్ల డాలర్ల పెట్టుబడులు 2020 సరళీకరణ తరవాత వచ్చినవే. రక్షణ పరిశ్రమల్లో మెజారిటీ యాజమాన్యం ఇస్తామన్నా విదేశీ కంపెనీలు ముందుకు రాకపోవడం గమనార్హం. సాధారణ కంపెనీల్లా రక్షణ సంస్థలు మార్కెట్ కోసం పనిచేయకపోవడమే దీనికి కారణం. అధునాతన రక్షణ సాంకేతికతలను ఇతర దేశాలకు ఎంతమేర ఇవ్వాలనేది ఆ కంపెనీల మాత ృదేశ విధానాలు, ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది. రక్షణ సాంకేతికతల ఎగుమతి, లైసెన్సింగ్‌పై ఆ కంపెనీల మాతృదేశాలు నియంత్రణ, పరిమితులు విధించవచ్చు. భౌగోళిక రాజకీయాలు, రక్షణ వ్యూహాలపై ఆధారపడి ఆయా దేశాలు తమ విధానాలను రూపొందించుకుంటాయి. వాటిని సదరు కంపెనీలు ఆచరించకతప్పదు. చైనా దూకుడును చూసి పాశ్చాత్య దేశాలు పౌర, రక్షణ ప్రయోజనాలు రెండింటికీ ఉపయోగపడే సాంకేతికతల బదిలీపై నియంత్రణ విధిస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్, డేటా, క ృత్రిమ మేధ పరిజ్ఞానాల బదిలీపై జాగ్రత్త వహిస్తున్నాయి. అధునాతన పారిశ్రామిక రీతులను అందజేయడానికి వెనకాడుతున్నాయి. తమ కంపెనీలు రక్షణ రంగంలో ఇతర దేశాల్లో పెట్టే పెట్టుబడులపై నిఘా వేస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో కేవలం నూరు శాతం ఎఫ్‌డీఐని, విదేశీ యాజమాన్యాన్ని అనుమతించినంత మాత్రాన అధునాతన రక్షణ పరిజ్ఞానాలు మనకు అందుతాయని ఆశించడం అడియాసే అవుతుంది. భారతీయ భాగస్వాములకు మెజారిటీ వాటాలు ఉన్న రక్షణ పరిశ్రమల్లో సైతం అధునాతన సాంకేతికతలను అందించే విదేశీ భాగస్వాములకు వీటో అధికారం ఉంటోంది. సదరు సాంకేతికతలు విదేశీ సంస్థల దగ్గర ఉండటమే దీనికి కారణం. ఈ పరిస్థితిని నివారించడానికి 2025 రక్షణ విధానం కొన్ని నియంత్రణలు విధించినా వాటిని నిక్కచ్చిగా అమలు చేస్తే విదేశీ ఆయుధ కంపెనీలు భారత్‌కు దూరమైపోవచ్చు. విదేశీ కంపెనీలు స్వదేశంలోని ప్రభుత్వాల విధానాలను, ఎగుమతి కంట్రోళ్లను ఆచరిస్తాయే తప్ప ఇండియా కోసం వాటిని వదులుకుంటాయని భావించలేం!

సాంకేతికతల బదిలీయే ముఖ్యం

రక్షణ రంగంలోనే కాదు పౌర పరిశ్రమల్లోనూ సొంత సాంకేతికతలను వృద్ధి చేసుకోవడానికి భారతీయ కంపెనీలు పట్టుదల చూపడం లేదనే విమర్శలున్నాయి. మార్కెట్ బాగా ఉండే ఆటొమొబైల్ రంగంలో కూడా ఇదే పరిస్థితి. భారతీయ కంపెనీలు సొంతంగా పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)కి పెట్టుబడులు కేటాయించకుండా విదేశీ ఆటొమొబైల్ కంపెనీలకు రాయల్టీలు, సాంకేతిక ఫీజులు చెల్లించడంతో సరిపెట్టేస్తున్నాయి. దక్షిణ కొరియా, తుర్కియేలు ఆర్‌అండ్‌డీకి, ఎగుమతులకూ ప్రాధాన్యమిస్తూ సొంతంగా బలమైన పారిశ్రామిక పునాదిని నిర్మించుకున్నాయి. తుర్కియే మొదట విదేశీ కంపెనీలతో కలిసి సంయుక్త పరిశ్రమలను ప్రారంభించినా క్రమంగా సొంత కంపెనీలను అభివ ృద్ధి చేసుకుంది. విదేశీ సహకారం, భాగస్వామ్యం తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదు. బ్రెజిల్, ఇజ్రాయెల్, సింగపూర్‌లలో ప్రభుత్వాలే పెద్ద పాత్ర పోషించాయి. మొత్తంగా, ఎఫ్‌డీఐ, విదేశీ భాగస్వామ్యాలు తాత్కాలికమేనని గ్రహించాలి. దీర్ఘకాలంలో సొంత కాళ్లపై నిలబడటమే ధ్యేయంగా పని చేస్తూ, ఆత్మనిర్భరత సాధించాలి. మన దేశంలో ఆయుధాల తయారీకి ముందుకొచ్చే విదేశీ కంపెనీలు (లేదా ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు–ఓఈఎంలు) భారత్‌లో నెలకొల్పే పరిశ్రమల్లో 74శాతం వాటా ఉన్నా 100 శాతం వాటా ఉన్నా తమ మేధాహక్కులను మాత్రం వదులుకోవు. తమ మాత ృదేశ ప్రభుత్వాలు అనుమతించిన మేరకే టెక్నాలజీని మనకు బదిలీ చేస్తాయి. కాబట్టి యుద్ధ విమానాలు, ఇతర అత్యాధునిక ఆయుధాల డిజైన్‌నూ, సోర్స్ కోడ్‌నూ, ఆధునికీకరణ హక్కులనూ మనకు ఇవ్వాలని పట్టుబట్టాలి. స్వదేశీ ఆయుధోత్పత్తి కంపెనీలను బలోపేతం చేసుకోవాలి. ఈ విషయంలో చైనా సాధించిన విజయాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భారత్‌లో పూర్తిగా విదేశీ యాజమాన్యంతో రక్షణ పరిశ్రమలను అనుమతించేకన్నా సాంకేతికతను మనకు బదిలీ చేసే విదేశీ కంపెనీలతో సంయుక్త పరిశ్రమలను నడపాలి. మన ప్రభుత్వ, ప్రైవేటు రక్షణ పరిశ్రమలకే అధిక ప్రాధాన్యమివ్వాలి. కీలక ఆయుధాల విషయంలో ప్రభుత్వానికి ప్రత్యేక హక్కులు, వాటాలు ఉండాలి. అధునాతన సాంకేతికతల బదిలీ కోసం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో పట్టుబట్టాలి. దీర్ఘకాలిక ప్రయోజనాలకే పట్టం కట్టాలి.

# బంగ్లా రాజకీయాల్లో ముగిసిన ఓ శకం

ఢాకా,ఒకవైపు రాజకీయ అనిశ్చితి, మరోవైపు దేశాన్ని అస్థిరపరిచేలా కొన్ని మాసాలుగా కొనసాగుతున్న అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌కు మరో పెను విఘాతం తగిలింది. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చైర్‌పర్సన్, మాజీ ప్రధానమంత్రి బేగం ఖలీదా జియా కన్నుమూయడం పొరుగు దేశానికి తీరని లోటు. నాలుగున్నర దశాబ్దాలపాటు జాతి రాజకీయాలను శాసించిన చరిత్ర ఆమెది. బంగ్లాదేశ్‌కు తొలి మహిళా ప్రధానిగా పనిచేసిన ఖలీదా ప్రజల నాడిని పసిగట్టి రాజకీయాలు చేయడంలో దిట్ట. పదిహేనేళ్ల వయసులో అప్పటికే సైనికాధికారిగా పనిచేస్తున్న జియావుర్ రెహ్మాన్‌ను వివాహం చేసుకున్న ఖలీదా, దాదాపు రెండు దశాబ్దాలపాటు రాజకీయాలకు దూరంగా, గ ృహిణిగా ఇంటికే పరిమితమయ్యారు. తన భర్త 1981లో జరిగిన సైనిక తిరుగుబాటులో మరణించిన తర్వాత, అప్పటికే జియావుర్ స్థాపించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీలో సభ్యత్వం తీసుకుని, తదనంతరం పార్టీకి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. నియంతగా, వందలాది సైనికులను ఊచకోత కోయించిన నేతగా పేరుపడిన భర్త అడుగుజాడలలో నడవకుండా, దేశంలోప్రజాస్వామ్యాన్ని పాదుగొలిపేందుకు చేసిన కృషి ఆమెను ప్రజలకు చేరువ చేసింది. సైనిక నియంత హుస్సేన్ మహ్మద్ ఎర్షాద్ పాలనపై ఆమె అలుపెరగని పోరాటం సలిపారు. సిద్ధాంతపరంగా వైరుధ్యాలు ఉన్నప్పటికీ ఏడు పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, సైనిక పాలనపై పోరాటాన్ని ముందుండి నడిపిన ఘనత ఆమెకే దక్కుతుంది. ఎర్షాద్ నియంత పాలన అంతమై, 1987లో పార్లమెంటరీ ఎన్నికలకు మార్గం సుగమం కావడానికి ఒక విధంగా ఖలీదా సలిపిన పోరాటమే కారణమంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో పలుమార్లు జైలుపాలైనా ఆమె వెరవలేదు. చివరకు 1991లో బిఎన్‌పి ఘన విజయం సాధించడంతో, దేశ ప్రధానిగా ఖలీదా తొలిసారి పదవీబాధ్యతలు చేపట్టారు. అయితే అప్పటికే చితికిపోయిన దేశ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడం ఆమెకు పెను సవాలుగా మారింది. ప్రపంచ దేశాల సహాయ సహకారాలతో ఆమె క్రమంగా దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేశారు. రెండు దఫాలు ప్రధానిగా ఎన్నికై, పదేళ్లపాటు ప్రభుత్వాన్ని నడిపిన ఖలీదా.. కేర్ టేకర్ ప్రభుత్వ వ్యవస్థకు రూపకల్పన చేశారు. పార్లమెంటులో 45 ఎంపి సీట్లను మహిళలకు రిజర్వ్ చేసిన ఘనత కూడా ఆమెదే. దేశంలో 70% మంది బాలికలు, యువతులు చదువుకునేందుకు పలు సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రాథమిక విద్యను ఉచితంగా అందించడం తప్పనిసరి చేశారు. అయితే ఖలీదా జియా హయాంలో అవినీతి పేట్రేగిపోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమె స్వయంగా నెలకొల్పిన జియా ఆరానేజ్ ట్రస్ట్ నిధుల దుర్వినియోగం కేసులో తన ఇద్దరు కుమారులతోపాటు ఆమె అరెస్టయ్యారు. ఈ కేసులో కోర్టు ఆమెకు పదిహేడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని ఆమె కొట్టిపారేయడం వేరే విషయం. గత ఏడాది అప్పటి ప్రధాని షేక్ హసీనా భారత్‌కు పరారైన అనంతరం, బంగ్లాదేశ్ అధ్యక్షుడు ఆమెకు క్షమాభిక్ష పెడుతూ, జైలునుంచి విడుదల చేశారు. నాలుగు దశాబ్దాలపాటు దేశరాజకీయాలను శాసించిన ఇద్దరు బేగమ్ లు.. ఖలీదా జియా– షేక్ హసీనా మధ్య పచ్చగడ్డి



వేస్తే భగ్గుమనేది. భారత్ తో సత్సంబంధాలను కొనసాగించాలన్న హసీనా నిర?యాన్ని ఖలీదా తప్పుపట్టేవారు. భారత్ తో ఆమె నేరుగా విభేదించకపోయినా, చివరివరకూ అంటీముట్టని వైఖరినే అవలంబించారు. ఒక దశలో అధికారంలో ఉన్న షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని భారత్‌కు తాకట్టు పెడుతున్నారంటూ జియా మండిపడటం గమనార్హం. 1972 ఇండో బంగ్లా స్నేహపూర్వక ఒప్పందం పునరుద్ధరణను ఖలీదా తీవ్రంగా నిరసించారు. ఖలీదా బతికుండి ఉంటే, ప్రస్తుత పరిస్థితుల్లో తన పార్టీని ఒంటి చేత్తో అధికారంలోకి తీసుకురాగలిగి ఉండేవారేమో. మరో ప్రధాన పార్టీ అయిన అవామీ లీగ్‌పై ఎన్నికల సంఘం ఇప్పటికే వేటు వేసిన నేపథ్యంలో, బహుశా విజయం ఆమెకు నల్లేరుపై నడక అయి ఉండేది. ఇప్పుడు ఆ పార్టీ బాధ్యతలను ఖలీదా కుమారుడు, పార్టీ యాక్టింగ్ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ తన భుజస్కంధాలపైకి ఎత్తుకున్నారు. పదిహేడేళ్ల అజ్ఞాత జీవితానికి స్వస్తి చెప్పి, నాలుగు రోజుల క్రితమే స్వదేశానికి వచ్చిన ఆయన, తల్లి అడుగుజాడల్లో నడుస్తూ అందలం ఎక్కుతారో లేదో చూడాల్సిందే.

## సిందూర్‌తో దెబ్బతీసినా వెనక్కి తగ్గం: లష్కరే నేత

లాహోర్, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, పాక్ సైన్యంపై విరుచుకుపడింది. పీఓకే, పాకిస్తాన్‌లోని ఇతర భాగాల్లోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలు, వాటి ప్రధాన కార్యాలయాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో వందలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, భారత్ తమ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిందని లష్కరేతోయిబా(ఎల్ఇటి) అగ్ర నాయకుడు అంగీకరించాడు. అయినప్పటికీ, భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డాడు.

లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్ సహాయకుడు, ఆ సంస్థ డిప్యూటీ చీఫ్, పహల్గామ్ దాడి సూత్రధారి అయిన సైఫుల్లా కసూరి భారత దాడులను ఒప్పుకున్నారు. పాక్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో కసూరి ఈ వ్యాఖ్యలు చేశాడు. విద్వేషపూరిత ప్రసంగంలో.. 'మేము మా కాశ్మీర్ మిషన్ నుంచి ఎప్పటికీ వెనక్కి తగ్గము' అంటూ వ్యాఖ్యలు చేశారు.

# ఉదయగిరి టీడీపీలో ముసలం...

ఉదయగిరి : ఉదయగిరి కోట టీడీపీలో పొలిటికల్ వార్ ముదురుతోంది. నేతల ఎత్తుకు పైఎత్తులతో అక్కడ రాజకీయం ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల సమయంలో సొంత పార్టీ వాళ్లే వెన్నుపోట్లు పొడిచినా తట్టుకుని నిలబడ్డానని.. అభివ ృద్ధికి అడ్డువస్తే తొక్కుకుంటూ పోతా అంటూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేసిన వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును ఉద్దేశించి ఇచ్చిన మాస్ వార్నింగ్‌గా భావిస్తున్నారు. దాంతో ఉదయగిరి టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయనేది తేటతెల్లమైంది. అయితే ముమ్మందు అంతర్గత విభేదాలు పార్టీని దెబ్బకొడతాయా అన్నా చర్చ నడుస్తోంది. ఆ క్రమంలో 25 ఏళ్లు ఇక్కడే ఉంటా.. ఉదయగిరిని అభివ ృద్ధి చేశాకే వెళ్తా అంటూ క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్యే కాకర్ల మాటలు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి.

సాఫ్ట్‌వేర్ రంగంలో విజయవంతమైన కాకర్ల సురేష్

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలు ప్రస్తుతం అత్యంత రసవత్తరంగా మారాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి, రాజకీయాల్లోకి రాకముందే 'కాకర్ల ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాకర్ల సురేష్, 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగి సంచలన విజయం సాధించారు. దశాబ్దాలుగా మేకపాటి కుటుంబం ఆధిపత్యం ఉన్న ఆ గడ్డపై, ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి 9,621 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచింది.

మాజీ ఎమ్మెల్యే బొలినేని వర్గంతో విభేదాలు

అయితే అధికారం చేపట్టిన 18 నెలలకే ఎమ్మెల్యే సురేష్‌కు క్షేత్రస్థాయిలో ఊహించని సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీని దశాబ్దాలుగా నమ్ముకున్న మాజీ ఎమ్మెల్యే బొలినేని వెంకట రామారావు వర్గానికి, ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్ల వర్గానికి మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు పార్టీని రెండు వర్గాలుగా చీల్చిందంట. ఎన్నికల సమయంలో అధిషా'నం జోక్యంతో ఇద్దరు నేతలు ఒకే వేదికపైకి వచ్చినప్పటికీ, నేడు చేతులు కలిసినా మనసులు కలవని చందగా పరిస్థితి తయారైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రోటోకాల్ విషయంలో రెండు వర్గాల మధ్య విభేదాలు

ఉదయగిరి నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమాల నిర్వహణ, ప్రోటోకాల్ విషయంలో కూడా ఇరు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో విబేధాలు భగ్గుమంటున్నాయి. తనను పట్టించుకోవడం లేదని, కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని బొలినేని తీవ్ర అసంత ృప్తితో ఉన్నారట. మాజీ ఎమ్మెల్యే అనవసరంగా ప్రభుత్వ పాలనలో జోక్యం చేసుకుంటున్నారని కాకర్ల వర్గం ప్రత్యారోపణలు చేస్తోంది. బొలినేని కేడర్‌ను ఎమ్మెల్యే విస్మరిస్తున్నారని, కేవలం తన చుట్టూ ఉన్న కోటరీకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఒక వర్గం ఆరోపిస్తే.. మరో వర్గం అభివ ృద్ధికి అడ్డుపడుతూ.. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపిస్తుండడం ఉదయగిరి నియోజకవర్గం జిల్లాలో హాట్ టాపిక్ అయింది.

రూ.300 కోట్ల అభివ ృద్ధి పనులు చేపట్టామంటున్న ఎమ్మెల్యే

తనపై విమర్శలన్నింటినీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అత్యంత ధీటుగా తిప్పికొడుతూ..అభివృద్ధి విషయంలో తాను వెనక్కి తగ్గేది లేదని చెబుతున్నారు. గత 18 నెలల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో సుమారు 300 కోట్ల రూపాయల అభివ ృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఇటీవల ఓ సమావేశంలో వెల్లడించారు. సోమశిల ఉత్తర కాలువ విస్తరణకు రూ. 67 కోట్లు, 149 చెరువుల బలోపేతానికి రూ. 7 కోట్లు వెచ్చించి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. చారిత్రాత్మక ఉదయగిరి కోటను రూ. 52 కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, వలసలను అరికట్టడమే తన లక్ష్యమని ఆయన పునరుదాటించారు. నియోజకవర్గంలోని పేద ప్రజల కోసం ఇప్పటివరకు రూ. 7 కోట్ల %జవీ=ఖీ% నిధులను లబ్ధిదారులకు అందజేశామని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు 'ప్రజా దర్బార్' నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు ఎమ్మెల్యే..

పదిమంది ఎదురు వస్తే తొక్కుకుంటూ పోతానని వార్నింగ్

తాను తెలుగుదేశం పార్టీ ప్రోడక్ట్‌నని, ఎన్టీఆర్ విద్యా సంస్కరణలు, చంద్రబాబు ఐటీ సంస్కరణల వల్లే ఈ స్థాయికి ఎదిగానని సురేష్ గుర్తుచేశారు. నియోజకవర్గ అభివ ృద్ధికి ఒకరు అడ్డువస్తే నెట్టుకుంటూ పోతానని..పదిమంది వస్తే తొక్కుకుంటూ పోతానని, పనికిమాలిన ఆరోపణలకు తాను భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా నుండి తాను వచ్చింది కేవలం ప్రజా సేవ కోసమేనని, ప్రైవేట్ పంచాయతీలు చేయడం తన ఉద్దేశం కాదని ప్రత్యర్థి వర్గం ఆరోపణలకు ఘాటుగా సమాధానమిచ్చారు. వింజమూరులో డైయాలసిస్ సెంటర్ ఏర్పాటు, మారుమూల గ్రామాలకు 21 కొత్త మొబైల్ టవర్ల మంజూరు వంటి పనులు తన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో ఉదయగిరి రాష్ట్రంలోనే 12వ స్థానంలో నిలవడం కార్యకర్తల పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

మరో 25 ఏళ్లు ఉదయగిరిలోనే ఉంటానంటున్న కాకర్ల

తనను ఎన్నారై అని, త్వరలోనే వెనక్కి వెళ్లిపోతానని కొందరు నాయకులు ప్రచారం చేస్తున్నారని, కానీ తాను మరో 25 ఏళ్లు ఉదయగిరిలోనే ఉండి ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివ ృద్ధి చేసిన తర్వాతే విశ్రమిస్తానని స్పష్టం చేశారు. రాజకీయ కక్షలు లేని ప్రశాంత ఉదయగిరిని నిర్మించడమే తన సంకల్పమని ప్రకటించారు. ప్రతి నిత్యం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివ ృద్ధి ఎజెండాతో ముందుకు వెళ్తుంటే..తనపై కొంతమంది కుట్రపూరితంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు కాకర్ల సురేష్. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తనకు ఎలాంటి సంబంధం లేని అంశాల్లో బ్యాడ్ చేస్తున్నారని.. ఇలాంటివన్నీ తన దగ్గర కుదరవని హెచ్చరిస్తున్నారు ఎమ్మెల్యే కాకర్ల సురేష్.

రోడ్లు నిర్మాణ కాంట్రాక్టర్ల విషయంలో వివాదం..

ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. రోడ్లు నిర్మాణ కాంట్రాక్టర్ల విషయంలో మరో వివాదం ఏర్పడిందట. బొల్లినేని రామారావు వర్గానికి చెందినవారికి కాంట్రాక్ట్ పనులు ఇచ్చేది లేదని ఎమ్మెల్యే వర్గం చెబుతోంది. ఆ క్రమంలో పొరుగు ప్రాంతాలకు చెందిన వారిని తెచ్చి కాంట్రాక్టు పనులు అప్పగించారట. ఆ కాంట్రాక్టర్లను బొల్లినేని వర్గం బెదిరింపులకు గురి చేసిందన్న ఆరోపణలున్నాయి. ఇలా ఎమ్మెల్యే కాకర్ల, బొల్లినేని మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తానికి ఈ ఇద్దరు నాయకులు టీడీపీలోనే ఉన్నా.. అంతర్గత కుమ్ములాటలు పెరగడంతో.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బహిరంగ వార్నింగులు ఇచ్చారన్న చర్చ నడుస్తోంది. మొత్తానికి ఉదయగిరి రాజకీయం ఇప్పుడు అభివ ృద్ధి సంకల్పానికి, రాజకీయ ఆధిపత్య పోరుకు మధ్య సాగుతున్న ఒక యుద్ధంగా మారింది. ప్రజలు ఎమ్మెల్యే చేస్తున్న అభివ ృద్ధి పనులను స్వాగతిస్తున్నప్పటికీ, సొంత పార్టీలోని విభేదాలు వస్తున్న ఆరోపణలు నియోజకవర్గ భవిష్యత్తును ఎలా మలుపు తిప్పుతాయోనని ఉదయగిరి ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

## కాశ్మీర్‌లో మంచుదుప్పటి

శ్రీనగర్, జమ్ముకశ్మీర్ లోని కశ్మీర్ లోయ లో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ స్పాట్ అయిన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు పరుచుకున్నది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలను టూరిస్టులకు కనువిందు చేస్తున్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తున్నది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మంచును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఆ మంచు దృశ్యాలను సోషల్ మీడియాలో పలువురు పర్యాటకులు పంచుకున్నారు.

## హిందూ జంటలు కనీసం ఇద్దరిని కనాలి

గౌహతి,జనాభా పెరుగుదలకు యువత ఆలోచన చేయాలని అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత హిమాంత బిశ్వశర్మ సంతానం మరోసారి కామెంట్స్ చేశారు. అస్సాంలోని హిందూ జంటలు ఒక్క సంతానంతో ఆపవద్దని, కనీసం ఇద్దరినైనా కనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హిందువుల జననాల రేటు ఆందోళనకర రీతిలో తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీ డామినేట్ ఏరియాలతో పోల్చి చూస్తే ఇతర ప్రాంతాల్లో జననాల రేటు తక్కువగా ఉన్నదని అన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. మైనారిటీ డామినేటెడ్ ఏరియాల్లో జననాల నిష్పత్తి ఎక్కువగా ఉన్నదని అస్సాం సీఎం చెప్పారు. అదే సమయంలో హిందువుల్లో జననాల రేటు వేగంగా తగ్గిపోతోందని అన్నారు. అందుకే పిల్లలను కనడం ఒక్కరితో ఆపవద్దని హిందూ జంటలను కోరారు. కనీసం ఇద్దరినీ కనాలని, వీలైతే ముగ్గురిని కన్నా మంచిదేనని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో మైనారిటీలు ఏడు, ఎనిమిది మంది పిల్లలను కనడం ఆపేయాలని సూచించారు.

## 2026 జరిగేది ఇదే !

న్యూఢిల్లీ,5 దాయాది పాకిస్తాన్ మీద భారత్ ప్రయోగించిన ఆపరేషన్ సింధూర్ ప్రయోగం సక్సెస్ అయింది. ఈ దెబ్బకు టోటల్ గా కూసాలు అన్నీ కదిలిపోయి తన ప్లేస్ ఎక్కడో చూసుకుని మరీ మూలన కూర్చుండిపోయింది పాక్. అయినా పగతో రగులుతూనే ఉంది. చాన్స్ దొరికితే భారత్ మీద ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. కాలాన్ని క్యాలెండర్ లో రోజులుగా లెక్క పెట్టి మరీ ఉగ్గపట్టి చూస్తోంది. మేలో జరిగిన ఆపరేషన్ సింధూర్ తరువాత పాక్ నుంచి సౌండ్ అయితే లేదు, ఈ లోగా ఏడు నెలలు ఇట్టే గడచిపోయాయి. ఈ మధ్యలో లేస్తే మనిషిని కాను అన్నట్లుగా పాకిస్థాన్ ప్రకటనలు అయితే ఇస్తూ పోతోంది. వాటిని భారత్ నిశితంగా గమనిస్తూనే ఉంది.

రక్షణ ఒప్పందాలతో :

తాను ఒంటరిగా వస్తే భారత్ తో ఢీ కొనడం కష్టమని పాక్ కి తెలుసు. అందుకే ఈ ఏడాది సెప్టెంబర్ లో సౌదీ ఆరేబియాతో రక్షణ ఒప్పందం చేసుకుంది. ఒక దేశం మీద ఎవరు దాడి చేసినా రెండు దేశాల మీద దాడి జరిగినట్లుగా భావించి రెండు దేశాలు యుద్ధానికి దిగాలన్నది ఈ ఒప్పందంలోని సారాంశం. ఇక్కడ చూస్తే సౌదీ అరేబియా మీద ఎవరూ ఎటాక్ చేసే పరిస్థితి లేదు. పాక్ తన కోసమే ఈ ఒప్పందం కుదుర్చుకుంది అన్నది అందరికీ తెలిసిందే. ఇలా సౌదీతో రక్షణ ఒప్పందం చేసుకుని భారత్ మీద బుసలు కొడుతున్న పాక్ పనిలో పనిగా బంగ్లాదేశ్ తోనూ ఇదే రకమైన ఒప్పందాన్ని చేసుకుంటోంది. దాంతో మూకుమ్మడిగా భారత్ మీద దాడి చేసేందుకు సరైన సమయం కోసం కాచుకుందని దౌత్య నిపుణులు అంటున్న మాట.

ఆ నివేదికలో :

భారత్ పాకిస్తాన్ ల మధ్య ఒక భారీ యుద్ధం 2026 లో జరిగే అవకాశాలు ఉన్నాయని అమెరికన్ విదేశాంగ విధాన నిపుణులను సర్వే చేసిన యూఎస్ థింక్ టాంక్ తన నివేదికలో తాజాగా వెల్లడించింది. సాయుధ దళాల మధ్య ఘర్షణకు ఆస్కారం ఉందని కౌన్సిల్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్ చెబుతోంది. కొత్త ఏడాదిలో భారత్ పాక్ ల మధ్య ఉగ్రవాదం విషయంలోనే మరోసారి సంఘర్షణలు మొదలవుతాయని కూడా పేర్కొంది. ఈ విషయంలో భారత్ లో ఉగ్రవాద కర్యకలాపాల పెరుగుదల ఉంటుందని కూడా పేర్కొంది.

ఇదే సీజన్ గా :

ఉగ్రవాదులు ఎపుడూ భారత్ లో చొరబడేందుకు చలి వాతావరణాన్ని ఎంచుకుంటారు ప్రస్తుతం చూస్తే కాశ్మీరు లో మంచుతో అంతా కప్పబడి ఉంది. ఈ వణికించే చలిలోనే ఉగ్రమూకలు భారత్ లోకి ప్రవేశించే అవకాశాలు మెండుగా ఉంటాయని అంటున్నారు. ఇక జమ్మూలో చూస్తే ఇప్పటికే పాకిస్థాన్ కి చెందిన ముప్పయికి పైగా ఉగ్ర మూకలు క్రియాశీలంగా పనిచేస్తూ తిష్ట వేసి కూర్చున్నట్లుగా భారత్ లోని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇపుడు అత్యంత కఠినమైన పరిస్థితులు కాశ్మీర్ లో ఉన్నా ప్రకృతి సహకరించకపోయినా భారత భద్రతా బలగాలు కాశ్మీరులో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్స్ ని గట్టిగా నిర్వహిస్తున్నాయి.

రక్షణ కొనుగోళ్లతో :

మరో వైపు చూస్తే అటు పాకిస్థాన్ ఇటు భారత్ కూడా తమ రక్షణ పరికరాలను పెద్ద ఎత్తున పెంచుకుంటున్నాయి. కొత్తగా కొనుగోలు చేస్తున్నాయి. డ్రోన్లు ఎయిర్ టూ ఎయిర్ క్షిపణులు, గైడెడ్ బాంబులను కొనుగోలు చేయడానికి భారత రక్షణ శాఖ ఇటీవల ఏకంగా 80 వేల కోట్లను మంజూరు చేసింది. పాకిస్తాన్ అయితే చైనా నుంచి టర్కీ నుంచి కొత్త డ్రోన్లు, పటిష్టమైన వైమానిక రక్షణ వ్యవస్థ కోసం అవసరమైన వాటిని కొనొగోలు చేస్తోంది. ఇవన్నీ చూసినపుడు కచ్చితంగా ఏదో రూపంలో యుద్ధానికి అవకాశం ఉందనే అంటున్నారు. తన పాత బుద్ధిని పాడు బుద్ధిని పాక్ వదులుకోదు, ఆ దేశం భారత్ లో ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించేవారికి మద్దతు ఇవ్వకుండా మానదు, దాని ఫలితం పర్యవసానంగా భారత్ ఆగ్రహిస్తే యుద్ధం అనివార్యంగా సంభవించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అంటే 2025లో వదిలేసింది 2026లో కొనసాగుతుంది.

## గణతంత్రంలో యానిమల్ కంటింజెంట్

న్యూఢిల్లీ, గణతంత్ర దినోత్సవంలో ఈయేడు జంతువుల పరేడ్ ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ మేరకు కొత్తంగా ప్రయొగం చేయబోతున్నారు. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో వచ్చే ఏడాది జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతులో ఈసారి ఓ అరుదైన కంటింజెంట్ చేరనుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్ లో తొలిసారిగా యానిమల్ కంటింజెంట్ ను తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నామని అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే బాక్ట్రియన్ జాతికి చెందిన రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు దేగలు, పది స్వదేశీ జాతి ఆర్మీకి చెందిన జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉన్నాయి.

## లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబై,గత నాలుగు సెషన్లుగా నష్టాలతోనే పయనం సాగించిన దేశీయ సూచీలు బుధవారం మాత్రం లాభాల జోరు అందుకుని 2025 సంవత్సరానికి శుభం పలికాయి. ముఖ్యంగా స్టీల్ స్టాక్స్ భారీ లాభాలను అందుకోవడం సూచీలకు కలిసొచ్చింది. అలాగే క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం, కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు మార్కెట్లను ముందుకు నడిపాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాలతో రోజును ముగించాయి గత సెషన్ ముగింపు (84, 675)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం 100 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా అదే జోష్‌ను కొనసాగించింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా లాభపడి 85, 437 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 545 పాయింట్ల లాభంతో 85, 220 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 190 పాయింట్ల లాభంతో 26, 129 వద్ద స్థిరపడింది÷సెన్సెక్స్‌లో హిందుస్థాన్ పెట్రో, జేఎస్‌డబ్ల్యు స్టీల్, సెయిల్, బీఈఎల్, ఎల్ అండ్ టీ ÷నాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. వొడాఫోన్ ఐడియా, హిందుస్థాన్ జింక్, పీబీ ఫిన్‌టెక్, టీసీఎస్, కోఫెన్ టెక్నాలజీస్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 410 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 570 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.87గా ఉంది.

## జాత్యహంకారం సమాజానికి పట్టిన అంటువ్యాధి

హైదరాబాద్,ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థి ఎంజెల్ చక్మ కిరాతక హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన దేశంలో పెరుగుతున్న విద్వేషానికి, జాత్యహంకారానికి పరాకాష్ట అని ఆయన సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. జాత్యహంకారం అనేది నాగరిక సమాజానికి పట్టిన అంటువ్యాధి అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. త్రిపురకు చెందిన ఎంజెల్ చక్మ మరియు అతని సోదరుడు మైఖేల్ డెహ్రాడూన్‌లో ఉన్న సమయంలో, కొందరు దుండగులు వారి రూపంపై జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ అవమానించారు. దీనిపై ప్రతిఘటించినందుకు గాను వారిపై కత్తులు, రాడ్లతో కిరాతకంగా దాడి చేశారు. 'మేము భారతీయులం. మా జాతీయతను నిరూపించుకోవడానికి ఇంకేం సర్టిఫికేట్ చూపాలి?' అని ఎంజెల్ ప్రశ్నించడం ఆ అమానుష దాడికి ముందు అతను చేసిన ఆఖరి నిరసన. ఈ దాడి అనంతరం ఎంజెల్ తీవ్ర గాయాలతో దాదాపు 16 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ఆసుపత్రిలో కన్నుమూశాడు. అయితే ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వైవిధ్యంలో ఏకత్వం కలిగిన భారతదేశం ఇలాంటి ఎంపిక చేసిన విద్వేషాలను భరించలేదని, ఇటువంటి విష సంస్కృతి దేశ మనుగడకే ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాత్యహంకారం ఏ రూపంలో ఉన్నా దానిపై కఠిన విధానాలు పాటించాలని, బాధితుడికి న్యాయం జరగడం విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఖండనలతో సరిపెట్టకుండా, జాత్యహంకార వ్యాఖ్యలు మరియు హింసకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం స్పష్టమైన, కఠినమైన చట్టాలను తీసుకురావాలని కేటీఆర్ కోరారు. ఇలాంటి ఘటనలు విడిగా జరిగేవి కావని, సమాజంలో ద్వేషం సాధారణీకరించబడుతుందనడానికి(ఔనీసపజ్జీ÷తిబı) ఇది ఒక హెచ్చరిక అని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఒక బీఎస్ఎఫ్ జవాను కుమారుడైన ఎంజెల్ చక్మ ఇలా జాత్యహంకారానికి బలికావడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్‌తో పాటు పలువురు జాతీయ నేతలు ఈ ఘటనను ఖండించారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.

## నగరంలో మొదలైన తనిఖీలు

హైదరాబాద్, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఫ్లై ఓవర్లు మూసేసారు. ఎక్కడిక్కడ తనిఖీలు మొదలు పెట్టారు. సాయంత్రం నుంచే పోలీసులు వాహనాలను చెక్ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో నగర వాసులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశాడు. రాత్రి నగరం అంతటా 120కి పైగా కీలక పాయింట్లలో ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబోతున్నట్లు తెలిపాడు. ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని, అలాగే కోర్టు ద్వారా జైలు శిక్ష మరియు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే పక్రియను చేపడతామని హెచ్చరించారు. కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ మాత్రమే కాకుండా అతివేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి ఇబ్బంది కలిగించేలా న్యూసెన్స్ చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, స్వయంగా డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ సేవలను లేదా డ్రైవర్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ యంత్రాంగం కోరింది.

## వృద్ధులను గౌరవించుకోవడం మన బాధ్యత

కాకినాడ,కుటుంబాలను నిలబెట్టి.. సేవలందించిన వృద్ధులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. వృద్ధుకలు గౌరవం ఇవ్వడం మన బాధ్యతని అన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం కూడా వారికి ప్రాధాన్యత ఇస్తూ ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా పెరవలి మండలం అన్నవరప్పాడులో బుధవారం పలువురు వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు రూ. 2 కోట్లు మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే పుష్కరాలకు దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రంగినీడి గంగాధరరావు కుమారుడు సత్యనారాయణ (బాబి) ఇటీవల మృతి చెందడంతో గంగాధరరావును, సోదరుడు కట్లయ్యల కుటుంబాలను మంత్రి పరామర్శించారు.

# ఆందోళనకరంగా డ్రగ్స్,ఆన్‌లైన్ మోసాలు !




హైదరాబాద్,మాదకద్రవ్యాలు, గంజాయి, డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాలు ఇప్పుడు సమాజాన్ని ఆందోళన కలిగిస్తోంది.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాదకద్రవ్యాలకు తోడు, ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా చూసాం. గతేడాది విపరీతంగా దాడులు చేసి మదకద్రవ్యాలను, గంజాయిని పట్టుకున్నా చీమల పుట్టల్లా దుండగులు పుట్టుకుని వస్తున్నారు. కొత్త సంవత్సరం ముందు మాదకద్రవ్యాల పట్టివేత జరుగుతున్నా ఇంకా ఆగడం లేదు. పోలీస్ శాఖ గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రత్యే దష్టితో కృషి చేస్తోంది. ఆన్‌లైన్ మోసాలపై తరచూ హెచ్చరికలు చేసి, ప్రకటనలు గుప్పిస్తున్నా..మోసాలు ఆగడం లేదు. ప్రజలు ఏమరుపాటు కారణంగా మోసాలు సాగుతున్నాయి. ప్రస్తు డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే వేగంతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లే లక్ష్యంగా, విదేశీ గడ్డపై నుంచి భారతీయుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. గత రెండేళ్లలోనే బాధితులు వేల కోట్లను కోల్పోయారు. ఒకవైపు వేల సంఖ్యలో కేసులు నమోదవుతుంటే, మరోవైపు రికవరీ మాత్రం నామమాత్రంగానే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు ఆధునిక సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో దర్యాప్తును వేగవంతం చేస్తున్నప్పటికీ, నేరగాళ్ల నెట్‌వర్క్ అంతర్జాతీయ స్థాయికి విస్తరించడం సవాలుగా మారింది.లో సైబర్ కేసులు నమోదనేది కేవలం సాంకేతికంగా ఓ సంఖ్యగా కనబడుతున్నప్పటికీ.. పోగొట్టుకున్న నగదును తిరిగి తీసుకొచ్చి వారికి అందించడం పోలీస్‌శాఖకు ఓ సవాలుగా మారింది. పోలీస్‌శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెబుతున్నప్పటికీ వైట్ కాలర్ నేరాల్లో రికవరీలను గమనిస్తే పేలవంగా కనబడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనికి మోసగాళ్లే అత్యాధుని టెక్నాలజీ వాడుతున్నారని గుర్తించాలి. సైబర్, డిజిటల్ నేరాలకు పాల్పడే వారు ఇతర దేశాల్లో ఉంటూ ఆపరేట్ చేయడంతోపాటు నగదు బదిలీ అయిన నిమిషాల్లోనే ఆ నగదు విదేశాలకు బదిలీ చేయడం, క్రిఫ్టో కరెన్సీగా నేరస్తుల వెనుక ముఠాలు పనిచేస్తుండటంతో రికవరీ కష్టంగా మారిందని పోలీస్ ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు. ఎపిలో సైబర్ కేసులు 2024లో 66,507 నమోదు కాగా, ఈ ఏడాది (2025) ఇప్పటి వరకు 62,414 నమోద య్యాయి. ఇందులో గతేడాది 2,877 కేసులు, ఈ ఏడాది 2,332 కేసులు ఎఫ్ఐఆర్ అయినట్లు పోలీస్ రికార్డులు వెల్లడిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. రెండేళ్లలో ప్రజలు నష్టపోయింది రూ. 1,789 కోట్లు కాగా, ఇందులో గతేడాది రూ. 974 కోట్లు, ఈ ఏడాది రూ. 815 కోట్లుగా ఉంది. ఇందుకు సంబంధించి గతేడాది రూ. 123 కోట్లు, ఈ ఏడాది రూ. 98 కోట్లను బ్యాంకుల్లో విత్ హోల్డ్‌లో పోలీస్‌శాఖ పెట్టించగలిగింది. ఇక నష్టపోయిన నగదులో గతేడాది రూ. 4.7 కోట్లు, ఈ ఏడాది కేవలం రూ. 3 కోట్లను రాబట్టగలిగింది. ఇక ఆర్థిక నేరాలకు సంబంధించి గతేడాది 7,667 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 8,034 కేసులు నమోదై 4.78 శాతం వృద్ధి రేటు కనబడుతోంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని, మభ్యపెట్టి డిజిటల్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇందులో అత్యధికంగా చీటింగ్, నేరపూరిత సంఘటనలు, నమ్మకద్రోహాలు వంటి ఘటనలు వల్ల కేసులు పెరుగుతున్నట్లు పోలీస్‌శాఖ పేర్కొంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా నేరాల నియంత్రణకు డ్రోన్లు, సిసి టివిలు, ఎఐ హాక్‌థాన్, ఎఐ టూల్స్‌ను కూడా ఉపయోగిస్తున్నామని వార్షిక నివేదికలో పోలీస్‌శాఖ వెల్లడించింది. ఇకపోతే తెలంగాణ, ఆంధ్రాల్లో మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతుండడం, వీటికి మత్తుకు యువత బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే డ్రగ్స్, గంజాయి పట్టుబడుతున్నాయి. ఈ ఏడాది 30శాతానికి పెరిగిన ఎన్డీపీఎస్ అంటే నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్స్ కేసుల సంఖ్య తెలంగాణలో 'మత్తు' మూలాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ డ్రగ్స్ రహిత తెలంగాణెళి లక్ష్యంగా దాడులు విపరీతంగా చేస్తోంది. అయితే దాడులు విపరీతంగా ఉన్నా గతంతో పోల్చితే 39శాతం యువత డ్రగ్స్‌కు బానిసలు కావడం దురదృష్టకరం. 2023లో రూ. 94.39 కోట్లు, 2024లో రూ. 139.69 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంటే ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో రూ. 172.93 కోట్ల విలువైన సింథటిక్ డ్రగ్స్, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి ప్రకటించిన వార్షిక నివేదికలో చెప్పారు. ఈ ఏడాది ఎన్డీపీఎస్ కేసుల్లో 81మందికి శిక్ష పడినట్టు తెలిపారు. సుమారు రూ. 41.47 కోట్ల విలువైన ఆస్తులను డ్రగ్స్ పెడ్లర్ల నుంచి జప్తు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కడిక్కడ ప్రచారం ముమ్మరం చేశారు. ఈ ఏడాది 571కార్యక్రమాలు చేపట్టామని, 47,881మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్‌ను ఎన్‌రోల్ చేశామని డిజిపి పేర్కొన్నారు. కల్తీ కల్లు కేసుల్లో రూ. 42 కోట్ల విలువైన ఆల్ప్రజోలం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# నయా రాజకీయం ఎన్నికల్లో చెప్పనవి చేస్తారు!

హైదరాబాద్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు..చేసిన వాగ్దానాలు అమలు చేయడం..వాటి కోసం ప్రయత్నించడం గతంలో చూసిన రాజకీయం. రాజకీయ పార్టీలకు ఎన్నికల మ్యానిఫెస్టోలు భగవద్గీత..బైబిల్, ఖురాన్ వంటివని..అందులో చెప్పిన హామీలు అమలు చేస్తాం..మాకు అధికారం ఇవ్వడంటూ ఓటర్లను అభ్యర్థించడం ఇప్పటిదాకా చూశాం. కాని తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్న రాజకీయం అందుకు భిన్నంగా కనిపిస్తుంది.ఎన్నికల్లో..మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చెప్పని హామీలు అమలు చేసే నయా పొలిటికల్ ట్రెండ్ కొనసాగుతుంది. ఇందుకు తెలంగాణ ఉద్యమనేత..మాజీ సీఎం కేసీఆర్ ఆధ్యుడు కాగా..అదే బాటలో కొనసాగుతున్నారు ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి. జనం అడగని కోరికలతో పథకాలు తెచ్చి..ఎన్నికల్లో చెప్పిన హామీలు అమలు చేయకుండా..చెప్పని పథకాలు తేవడం తెలంగాణ రాజకీయాల్లో ఒరవడిగా మారిపోయింది. పాలకులు చెప్పిన హామీలు అమలు చేయకపోవడానికి ఆర్థిక సమస్యలు ఎంత కారణమో..చెప్పని హామీలు అమలు చేస్తుండటం వెనుక ఆర్థిక ప్రయోజనాలు అంతే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ తో మొదలైన నయా ట్రెండ్..

ఎన్నికల్లో మీరు అడగకుండానే రైతు బంధు..దళిత బంధు వంటి పథకాలు తెచ్చామని..ధరణి తీసుకొచ్చామని..కాళేశ్వరం కట్టామని..ఉద్యోగ విరమణ వయో పరిమితి పెంచామని..వేతనాలు పెంచామని మాజీ సీఎం కేసీఆర్ ఆయా వర్గాల ప్రజలకు పదేపదే చెప్పుకునే వారు. అయితే ఎన్నికల్లో ఇచ్చిన దళిత సీఎం, కేజీ టూ పీజీ ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి వంటి ఎన్నో హామీలు, కుర్చి వేసుకుని మరి.. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న హామీలను మాత్రం అమలు చేయలేదు. ఎన్నికల్లో చెప్పని భూముల అమ్మకాలు, ఔటర్ టెండర్ వంటివి ఎన్నో చేసేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ ఉద్యమ కాలంలో 2014, 2018ఎన్నికల సమయంలో చేసిన హామీలలో ఎన్నింటినో అమలు చేయని తీరు..ఎన్నికల్లో చెప్పని పథకాలెన్నో అమలు చేసిన వైనం..ఆయన తాలుకా రాజకీయాలకు నిదర్శనంగా కనిపిస్తుంది.

రేవంత్ రెడి పాలనలోనూ అదే తీరు

సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు..420హామీలు ఇచ్చి వాటిని నమ్మేందుకు ఇబ్బడిముబ్బడిగా బాండ్ పేపర్లు రాసిచ్చి మరి అధికారంలోకి వచ్చారు. ఇందులో ప్రధానంగా ఆరు గ్యారంటీల పథకాల అమలుపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిలో మహిళలకు ఉచిత ఆర్టీసీ పథకం. నిజానికి ఈ హామీ ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ గా కాకుండా ..కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీగా మాత్రమే తెరపైకి వచ్చింది. ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కొనసాగిస్తున్నారు. ఇలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ సహాయం పెంపు, ధాన్యంకు రూ. 500బోనస్ వంటి హామీలను అమలు చేస్తున్నారు.అయితే ఆరు గ్యారంటీల్లోని కీలకమైన మహిళలకు నెలకు రూ. 2,500ఆర్థిక సహాయం, రూ. 4వేలు పెన్షన్ మాత్రం అటకెక్కించారు. అలాగే ఆడపిల్లల పెళ్లికి రూ.లక్ష సహా తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, కౌలు రైతులకు రైతు భరోసా వంటి హామీల ఊసు లేదు. గత ప్రభుత్వం తమ నెత్తిపై వేసిన అప్పులు, ఆర్థిక వనరుల కొరత వంటి సమస్యలతో తాము ఆయా హామీల అమలు వాయిదా వేసుకోవాల్సి వస్తుందంటూ కాంగ్రెస్ పాలకులు చెబుతున్నారు.

ఆర్థిక సమస్యలే నిజమైతే కొత్త పథకాలు ఎందుకో?

అప్పులు, ఆర్థిక వనరుల కొరత సమస్యలే తమ ఎన్నికల హామీల అమలుకు అడ్డంకిగా మారాయన్నది నిజమైతే ఎన్నికల్లో ఇవ్వని హామీలు..చెప్పని కార్యక్రమాల అమలుకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయన్నదానిపై కాంగ్రెస్ పాలకులు జవాబు చెప్పక తప్పదు. ఎన్నికల్లో చెప్పని ఫ్యూచర్ సిటీ నిర్మాణం..కొత్త రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, పలు భవనాలు వంటివి ఎన్నో కార్యక్రమాలు..ప్రధానంగా వందలు, వేల కోట్లతో ఖర్చుతో కూడిన కాంట్రాక్టులు, కమిషన్లతో కూడిన కార్యక్రమాలు తెరపైకి వచ్చాయి. భారీ ఖర్చులతో కూడిన అందాల పోటీలు, గ్లోబల్ సమ్మిట్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లు నిర్వహించారు. కొత్తగా గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పోరేషన్లుగా ఏర్పాటుకు సిద్దమయ్యారు.




అప్పులు, ఆర్థిక వనరుల లోటుతో ఇబ్బంది పడుతున్న ప్రభుత్వానికి పాత హామీల అమలే గుది బండగా ఉన్నప్పుడు..ఇలాంటి కొత్త ఆలోచనలు ఎందుకన్న ప్రశ్న వినిపిస్తుంది.

పాత హామీల మాటేమిటో!

కాంగ్రెస్ ఎన్నికల్లో చెప్పిన ఎస్ఎల్బీసీ, పాలమూరు రంగారెడ్డి, తమ్మిడి హట్టి, డిండి ఎత్తిపోతల వంటి పెండింగ్ ప్రాజెక్టుల పనుల పూర్తి దిశగా పెద్దగా పురోగతి లేదు. పైగా ఎన్నికల్లో చెప్పని కొడంగల్ ఎత్తిపోతల పథకం కొత్తగా తెరపైకి వచ్చింది. కాళేశ్వరానికి ప్రత్యామ్నాయంగా తమ్మిడి హట్టి ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం చేపడుతామంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ తరహాలోనే ఎన్నికల్లో చెప్పని హామీలను వెనక్కి నెట్టేసి..కొత్త పథకాలు..కార్యక్రమాలతో హడావుడి చేస్తుంది. కాళేశ్వరంలో లక్ష కోట్లు కుమ్మరించి కమిషన్లు కొట్టేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించిన కాంగ్రెస్ పాలకులు..ఎన్నికల్లో చెప్పని ఫ్యూచర్ సిటీ వంటివాటిని నెత్తిన పెట్టుకుని..ఇచ్చిన హామీల అమలును పడకేయించడం ఏమిటన్న ప్రశ్నను ఎదుర్కొనక తప్పదు.రిటైర్డు ఉద్యోగుల బకాయిలు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్..గురుకులాలకు భవనాలు వసతుల కల్పనకు నిధులు ఇవ్వడంలో తంటాలు పడుతున్న ప్రభుత్వం మ్యానిఫెస్టోలో లేని కొత్త కార్యక్రమాలతో మరిన్ని ఆర్థిక కష్టాలు ఎందుకు తెచ్చుపెట్టుకుంటుందన్న వాదన వినిపిస్తుంది.

అడగని ఫ్రీ టోల్ ఆంద్రోళ్లకేనా? మేడారం భక్తులకు ఇస్తారా!

తాజాగా తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త వివాదాన్ని రాజేసుకుని సెల్ఫ్ గోల్ కు తెరలేపింది. సంక్రాంతికి జంటనగరాల నుంచి ఏపీకి వెళ్లే ప్రజల కోసం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి మార్గంలో టోల్ చార్జీలు రద్దు చేయాలని కేంద్రాన్ని కోరింది. కేంద్రం అనుమతించకపోతే ఆ టోల్ చార్జీల మొత్తాన్ని మేం చెల్లిస్తామంటుంది. ఇక్కడే సరికొత్త వివాదానికి బీజం పడింది. కేవలం ఆంధ్రకు వెళ్లే ప్రయాణికులకు టోల్ ఫ్రీ ప్రకటించి తెలంగాణలోని ఇతర జాతీయ రహదారుల మీదుగా తమ సొంత జిల్లాలకు వెళ్లే ప్రజలకు టోల్ ఫ్రీ ఎందుకు కేంద్రాన్ని అడగలేదన్న వాదన స్వరాష్ట్ర ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి బలంగా ఎదురవుతుంది. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు టోల్ ఫ్రీ అమలు చేస్తారా అన్న ప్రశ్న తెరపైకి రావడం సర్కార్ కు మరింత సంకటంగా మారింది. తాజాగా రెండు మూడురోజుల్లోనే మేడారానికి లక్ష మంది భక్తులు తరలివెళ్లడం గమనార్హం. అసలు ఎవరూ అడగని ఉచిత బస్సు పథకం మాదిరిగా ఈ టోల్ ఫ్రీ గొడవ ఎందుకు ఎత్తుకున్నారన్నంటూ సొంత పార్టీ వారే విమర్శిస్తున్నారు.ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడిగా ఏపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, నీళ్లు తరలించుకపోతున్నా పట్టించుకోవడం లేదంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఏపీ ప్రయాణికులకు టోల్ ఫ్రీ అంశం తెరపైకి తెచ్చి..సొంత రాష్ట్ర ప్రజల టోల్ ఫ్రీ అంశాన్ని విస్మరించిన తీరు మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తేనెతుట్టెను కదిపినట్లుగా ఉందంటున్నారు. ప్రభుత్వానికి స్వరాష్ట్ర ప్రజలపైన ప్రేమ ఉంటే..వివక్షతను వదిలి రాజీవ్ రహదారి, వరంగల్, రామగుండం, ఖమ్మం, నిర్మల్, కొత్తకోట మార్గాల్లో పండుగ సెలవుల్ల ప్రయాణించే తెలంగాణ వాహనదారులకు, మేడారం భక్తులకు కూడా టోల్ ఫ్రీ అమలు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటుంది.

## జనవరి 8న మంత్రివర్గ సమావేశం

అమరావతి,కొత్త సంవత్సరంలో ఏపీ మంత్రి మండలి సమావేశం జనవరి 8న జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు సంబంధించి ఆయా శాఖలు తమ ప్రతిపాదనలను జనవరి 6వ తేదీ సాయంత్రం 4:00 గంటలలోపు సమర్పించాలని మెమో జారీ చేశారు. నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు అందజేయాలని అధికారులకు సూచించారు. కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో, శాఖల నుంచి వచ్చే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత సమావేశాల్లో అమలు చేసిన పథకాలపై సమీక్ష, భవిష్యత్ పెట్టుబడుల ప్రణాళికలు, ప్రధాన సదుపాయాల అభివృద్ధి, విద్యా, రోడ్లు, రవాణా, పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విభాగాల ప్రతిపాదనల ఆధారంగా కేబినెట్ సమావేశంలో ముఖ్య నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. కొత్త ప్రాజెక్టుల అనుమతులు, కీలక పదవుల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## యూట్యూబర్ అన్వేష్‌పై పోలీస్ కేసు

హైదరాబాద్,యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదైంది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ సినీనటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభ్యంతర కంటెంట్ ప్రచారం చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి ఠాణాలోనూ ఇప్పటికే కేసు నమోదైంది. విశాఖపట్టణానికి చెందిన అన్వేష్ అనే యువకుడు విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల అతడు వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి.సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.యూట్యూబర్ అన్వేష్‌పై హైదరాబాద్‌లోని పంజాగుట్ట, ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ దేవతలు, మహిళలను కించపరిచేలా మాట్లాడాడని అన్వేష్‌పై ఫిర్యాదులు అందడంతో రెండు కేసులు నమోదు చేశారు. దేవీ దేవతలను యూట్యూబర్ అన్వేష్ దూషించాడని సినీ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్యాణి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్నారు. దీనిపై త్వరలోనే అన్వేష్‌కు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. యూట్యూబర్ అన్వేష్ చేసిన వ్యాఖ్యలు సామాజిక భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఖమ్మం అర్బన్ పోలీసులు వెల్లడించారు.

## చైనాను అధిగమిస్తుందా?

న్యూఢిల్లీ,2025 సంవత్సరం ముగింపు దశకు చేరుకుంది. గత ఐదు సంవత్సరాలను మనం వెనక్కి తిరిగి చూసుకుంటే, భారతదేశ తయారీ రంగం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు కాగితంపై మాత్రమే ఉన్నవి ఇప్పుడు వాస్తవంగా మారుతున్నాయి.నేడు మీరు చేతిలో పట్టుకున్న ఐఫోన్ భారతదేశంలో తయారు అవుతోంది. ఫోర్డ్ వంటి కంపెనీలు ఇంజిన్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి భారతదేశానికి తిరిగి వస్తున్నాయి. దక్షిణ కొరియా దిగ్గజం LG భారతదేశాన్ని దాని కొత్త నివాసంగా మార్చుకోవాలని ఆలోచిస్తోంది. ఇవి యాదృచ్ఛికం కాదు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రాథమికమైన, లోతైన ఏదో మారుతోందని సూచిస్తున్నాయి. మనం 2026లోకి అడుగుపెడుతున్నప్పుడు, విధాన రూపకర్తల నుండి సాధారణ పెట్టుబడిదారుల వరకు ప్రతి ఒక్కరి మనస్సులో ఒకటే ప్రశ్న. 2026 భారతదేశం నిజంగా చైనా వంటి తయారీ సూపర్ పవర్‌గా మారే మార్గాన్ని ప్రారంభించే సంవత్సరం అవుతుందా?భారతదేశ తయారీ రంగ విజృంభణను అర్థం చేసుకోవడానికి, మనం చైనాను అనుకరించడం మాత్రమే కాకుండా, మన స్వంత మార్గాన్ని రూపొందించుకుంటోంది. చైనా మోడల్ చౌక శ్రమ, భారీ ప్రభుత్వ మద్దతుపై ఆధారపడింది. కానీ భారతదేశం మార్గం భిన్నంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో అతిపెద్ద మార్పు కనిపిస్తుంది. 2025 చివరి నాటికి, భారతదేశం ఇకపై ఆపిల్‌కు అసెంబ్లీ లైన్‌గా మాత్రమే ఉండదు, ఒక ప్రధాన తయారీ కేంద్రంగా మారుతుంది. దీని అర్థం గతంలో భారతదేశానికి రావడానికి వెనుకాడిన విదేశీ సరఫరాదారులు, ఇప్పుడు ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి, కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ మొబైల్ ఫోన్‌లలోని కెమెరా మాడ్యూల్స్, డిస్‌ప్లేలు వంటి చిన్న భాగాలు కూడా ఇక్కడ తయారు చేసినప్పుడు నిజమైన ఆట మొదలవుతుంది. 2026 నాటికి, మనం ఫోన్‌లను అసెంబుల్ చేయడం కంటే కాంపోనెంట్ తయారీకి వెళితే, అది చైనాకు వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బూమ్‌కు నాంది పలికిన క్షణం అవుతుంది. సెమీకండక్టర్లు లేదా చిప్‌లను తయారు చేయడం భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్ణయం.. కానీ అత్యంత సాహసోపేతమైన వెంచర్. ప్రపంచ చిప్ కొరత, సరఫరా సిస్టమ్‌ను విచ్ఛిన్నాలు మన స్వంత చిప్‌లను కలిగి ఉండటం ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. 2026లో విజయం మనం ఎన్ని చిప్‌లను ఉత్పత్తి చేస్తాం అనే దాని ద్వారా కాదు, మనం పూర్తి పర్యావరణ వ్యవస్థను సృష్టించామా లేదా అనే దాని ద్వారా ఆధారపడి ఉంటుంది. చిప్ డిజైన్ ఇంజనీర్లు, ముడి పదార్థాల సరఫరాదారులు, వాటిని ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కలిసి పనిచేయడం ప్రారంభిస్తే, భారతదేశం ప్రయత్నాలు విజయవంతమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.బ్యాటరీ తయారీ, అరుదైన–భూమి ప్రాసెసింగ్ కూడా అంతే ముఖ్యమైనవి. అది విద్యుత్ వాహనాలైనా లేదా గృహ సౌర ఫలకాలైనా, శక్తి నిల్వ నేడు చాలా ముఖ్యమైన అవసరం. ఈ రంగాలలో భారతదేశం తన ఉనికిని బలోపేతం చేసుకుంటే, అది చైనాపై మన ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. కొత్త పారిశ్రామిక విప్లవానికి పునాది వేస్తుంది.చైనా విజయగాథలో లక్షలాది మంది రైతులు కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. భారతదేశ పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంది. మన జనాభా యువతరం, కానీ నైపుణ్యాల కొరత ఇప్పటికీ ఒక సవాలుగా ఉంది. ఇంకా, నేటి కర్మాగారాలు రోబోలు, ఆటోమేషన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. దీని వలన మునుపటి మాదిరిగానే ఉద్యోగాలను సృష్టించడం కష్టమవుతుంది. అందువల్ల, ఈ కొత్త కర్మాగారాలు మన యువతకు పెద్ద ఎత్తున ఉపాధిని కల్పించగలవా లేదా అనేది 2026 నాటికి తెలుస్తుంది. కొత్త కార్మిక విధానం, అప్రెంటిస్‌షిప్ పథకాలు ఇప్పుడు నిజంగా పరీక్షించబడతాయి. ఈ కంపెనీలు కేవలం కాంట్రాక్ట్ కార్మికులకు బదులుగా శాశ్వత ఉద్యోగాలను అందించడం

# కోర్ అర్బన్ ప్రక్షాళనకు ఐదేళ్ల ప్రణాళిక



హైదరాబాద్: రోడ్లపై చెత్త, గుంతలు కనపడొద్దని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో చెత్త నిర్వహణ ఇబ్బందికరమైన సమస్య అని, ఈ సమస్యపై జో నల్ కమిషనర్లు తమ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చెత్త నిర్వహణతో పాటు జోన్ల వారీగా ప్రజల స మస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్లదేనని ఆ యన పేర్కొన్నారు. జోనల్ కమిషనర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నగరాన్ని వివిధ జోన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో కొత్తగా నియమితులైన జోనల్ కమిషనర్‌లతో ముఖ్యమంత్రి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్లకు సిఎం దిశానిర్దేశం చేశారు. ఈ సం దర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేదించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, దశల వారీగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆయన సూచించారు.

### నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కోర్– అర్బన్ రీజయన్ ఎకానమీ ఏరియాలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కోర్–అర్బన్ రీజియన్‌ను మొత్తంగా ప్రక్షాళన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే ఐదేళ్లకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని హైదరాబాద్ నగర జోనల్ కమిషనర్లను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రం మొత్తం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని, హైదరాబాద్ పరిపాలన పట్టాలెక్కించాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని ఆయన తెలిపారు. ప్రధానంగా నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని, అలాగే రోడ్లపై గుంతలు కనిపించొద్దని, ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలిలని సిఎం అధికారులకు సూచించారు. ప్రతి పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని, ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై వీలైనంత తొందరగా స్పందించాలని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. కోర్–అర్బన్ ఏరియాలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకురావాలని నిర్ణయించామని, నగరంలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని సిఎం రేవంత్ తెలిపారు.


### నాలాల పూడికతీత పనులు జనవరి నుంచి

ప్రజలకు ముఖ్యంగా జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీ విషయంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ఇబ్బందులు కలగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ సేవల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించాలిలన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో అనుసంధానం ఉండేలా కమ్యూనికేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలన్నారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలో వీధిదీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని, కోర్ అర్బన్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సిఎస్ చూసుకుంటారని, అందరూ కలిసి పనిచేస్తేనే నగర భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

### ప్రతి నెలా ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష

ప్రతి నెలకు ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష చేస్తానని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని హోటల్స్ లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని అధికారులను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని ఆయన సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్దరించి యాక్టివిటీ జోన్స్ గా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. జనవరి నుంచి ప్రతి ఒక్కరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, జీహెచ్‌ఎంసీ కర్ణన్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండి అశోక్ రెడ్డి, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సి డిఏ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్..వచ్చే ఏడాది నుంచి అమలుకు బోర్డు కసరత్తు



హైదరాబాద్, ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ పరీక్షల విధానం, సిలబస్ లో ఇంటర్ బోర్డు భారీ మార్పులు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'కొత్త లెక్క'లను అమలు చేయబోతోంది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది మారనుంది. సీబీఎస్‌ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి థియరీ పరీక్షను 60 మార్కులకు కుదించనున్నారు. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్' కు కేటాయించనున్నారు. అంటే కాలేజీల చేతిలో ఈ 15 మార్కులు ఉండనున్నాయి. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్?లో మార్కులు వేస్తారు. దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150 మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు రూపొందించనున్నారు. కామర్స్ బ్యాక్ గ్రౌండ్ ఉండే ఎంఈసీ వాళ్లకు వారి సబ్జెక్టులకు ఉపయోగపడేలా మ్యాథ్స్ సిలబస్ ను రూపొందించనున్నారు. అలాగే, పరీక్షల విధానంతో పాటు సిలబస్ లోనూ మార్పులు జరగనున్నాయి. ప్రస్తుతం మ్యాథ్స్ బీలోనే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారు. దీన్ని గమనించిన ఇంటర్ బోర్డు.. మ్యాథ్స్ బీ పాఠ్య పుస్తకంలోని కొన్ని కఠినమైన చాప్టర్లను మ్యాథ్స్ ఏలోకి మార్చాలని డిసైడ్ అయింది. ఈ మార్పులన్నీ వచ్చే విద్యా సంవత్సరం నుంచే పక్కాగా అమలు కానున్నాయి.

# అనసూయ శివాజీలో ఎవరు గెలిచారు.. మధ్యలో అన్వేష్ ఎందుకు వచ్చాడు?



హైదరాబాద్,అనసూయ వర్సెస్ శివాజీ.. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో నడుస్తున్న హాట్ టాపిక్ ఇదే. ఒక డ్రెస్సింగ్ కామెంట్ తో మొదలైన ఈ రచ్చ, రోజుకో మలుపు తిరుగుతూ సాగింది. అసలు ఇందులో న్యాయం ఎవరి వైపు ఉంది? చివరికి ఎవరు గెలిచారు? అని ఆరా తీస్తే ఆసక్తికరమైన నిజాలు బయటపడుతున్నాయి. పైకి ఇది ఆత్మగౌరవం పోరాటంలా కనిపిస్తున్నా, లోపల జరుగుతున్న తంతు వేరు అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. నిజానికి.. ఈ ఎపిసోడ్ లో అనసూయ గెలవలేదు, అలాగని శివాజీ కూడా గెలవలేదని అంటున్నారు. ఇద్దరూ తమ సోషల్ మీడియా అకౌంట్ల ఎంగేజ్మెంట్ పెంచుకోవడంలో మాత్రం సక్సెస్ అయ్యారని.. ఇద్దరికీ ఫాలోవర్స్ పెరిగారు, రీచ్ పెరిగిందని అంటున్నారు. జనాలకు బోర్ కొడుతున్నా సరే, ఈ ఇష్యూని ఇంకా డ్రాగ్ చేయడం వెనుక అసలు కారణం ఇదేనని నెటిజన్లు ఫిక్స్ అయ్యారు. ఇదంతా ఒక 'మ్యూచువల్ బెనిఫిట్' డ్రామాలా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక ఈ మంటల్లో చలి కాచుకోవడానికి వచ్చిన మూడో వ్యక్తి యూట్యూబర్ అన్వేష్. ఒకప్పుడు మంచి ట్రావెల్ వ్లాగర్ గా పేరు తెచ్చుకున్న అన్వేష్, ఈ మధ్య కాలంలో తన గ్రాఫ్ పడిపోవడంతో ఆందోళనలో ఉన్నట్లున్నాడు. కొత్త ఫాలోవర్స్ రాకపోగా, ఉన్నవాళ్ళు తగ్గుతున్నారు. దీంతో ఎలాగైనా మళ్ళీ ట్రెండింగ్ లోకి రావాలనే అత్యుత్సాహంతో ఈ వివాదంలో తలదూర్చాడు. కానీ అది కాస్తా రివర్స్ అయ్యింది. లాజిక్ తో మాట్లాడాల్సింది పోయి, నోటికి వచ్చినట్లు బూతులతో విరుచుకుపడటంతో అన్వేష్ పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా సీతమ్మ, ద్రౌపది గురించి ఆయన చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని ఆగ్రహానికి గురిచేశాయి. సపోర్ట్ కోసం వస్తే, ఉన్న పరువు కాస్తా గంగలో కలిసినట్లయ్యింది. అటెన్షన్ కోసం చేసిన పని ఇప్పుడు అతని కెరీర్ కే ఎసరు తెచ్చేలా ఉంది. దెబ్బ గట్టిగా తగిలేసరికి బ్యాంకాక్ లో వినాయకుడి సాక్షిగా క్షమాపణలు చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ అక్కడ కూడా "నేను తప్పు చేస్తే రక్తం కక్కుకుని చనిపోతా" అంటూ సవాళ్లు విసరడం సిల్లీగా అనిపించింది. చేసిన తప్పును కవర్ చేసుకోవడానికి ఎంత ప్రయత్నించినా, జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది. నెగిటివిటీని తట్టుకోలేక ఇప్పుడు కవర్ డ్రైవ్ లు ఆడుతున్నాడనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఫైనల్ గా చూస్తే.. అనసూయ, శివాజీ ఎవరి దారిలో వాళ్ళు సేఫ్ గానే ఉన్నారు. కానీ మధ్యలో వచ్చిన అన్వేష్ మాత్రం పెద్ద చిక్కుల్లో పడ్డాడు. ఫాలోవర్స్ అంతా మూకుమ్మడిగా రిపోర్ట్ చేస్తుండటంతో, 'నా అన్వేషణ' ఛానల్ మళ్ళీ మొదటికి వచ్చే ప్రమాదం కనిపిస్తోంది. సోషల్ మీడియాలో క్రేజ్ కోసం హద్దులు దాటితే ఫలితం ఎలా ఉంటుందో అన్వేష్ ఎపిసోడ్ ఒక ఉదాహరణగా మిగిలిపోనుందని నెటిజన్లు హెచ్చరిస్తున్నారు. ఒక అభిప్రాయం ఉన్నప్పుడు దాన్ని అర్థమయ్యేలా చెప్పాలి కానీ బూతులతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హిందు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే పోలీస్ స్టేషన్లో కేసులు కూడా నమోదవుతున్నాయి. ఎప్పటికైనా అన్వేష్ ఇండియాకు వస్తాడు కదా అప్పుడు అతనికి తగిన కౌంటర్ ఇస్తామని మరికొందరు అంటున్నారు.

# అమరావతికి భూములిచ్చిన రైతుల్లో ఆందోళన

అమరావతి, అమరావతి రైతుల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. త్రిసభ్య కమిటీ తరచూ సమావేశం అవుతున్నా వారి సమస్యలను పెద్దగా పట్టించుకోవడం లేదు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాలట్లను, నష్టపరిహారం విషయంలో మాటలతో సరిపెడు తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పాత వ్యవహారాలనే పక్కన పెట్టి కొత్తగా మళ్లీ పూలింగ్ చేపట్టే పనిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలో రాజధాని అమరావతిలో రెండోదశ ల్యాండ్ పూలింగు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కార్యాలయ భవనాలను గుర్తించింది. గతంలో అనుభవం ఉన్న తొమ్మిది మంది కంప్యూటర్ ఆపరేటర్లను కూడా అన్ని గ్రామాలకూ కేటాయించింది. ఏడు గ్రామాల్లో తొమ్మిది యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. మూడో తేదీన నోటిఫికేషన్ ఇస్తే వెంటనే భూములిచ్చేవారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం కోసం డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తున్నారు. ఇప్పటికే నియామక పక్రియ పూర్తయినా ఒకటీ అరా అభ్యంతరాలున్న నేపథ్యంలో వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా మంగళవారం తగు సూచనలు చేసినట్లు సమాచారం. నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది కార్యకలాపాలు వంటి అంశాలపై సూచనలిచ్చారు. ప్రతి కార్యాలయంలో ఒక స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫర్నీచర్‌ను కూడా మంగళవారం గ్రామాల్లో యూనిట్ కార్యాలయాలకు తరలించారు. నోటిఫికేషన్ అనంతరం దరఖాస్తులు తీసుకోవడం, వాటిని పాత రికార్డులతో సరిపోల్చడం వంటి పనులు నిర్వహించ నున్నారు. ప్రతి దరఖాస్తుకూ సంబంధించిన సర్వే నెంబర్లను జిఐఎస్ మ్యాపులో ఉన్న సర్వే నెంబర్లు, ఫీల్డ్ సర్వే నెంబర్లు సరిపోల్చనున్నారు. వాటన్నిటినీ నిర్ధారించాల్సిన బాధ్యతను అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ల్యాండ్ పూలింగులో వచ్చిన అప్లికేషన్లలో ఉన్న విస్తీర్ణం, అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం ఒకటా కాదా అనేది ధ్రువీకరించిన అనంతరం 9.22 ప్రకటన చేయనున్నారు. గతంలో అన్నీ పూర్తయిన తరువాత సర్వే చేయడంతో కొంత



ఇబ్బందులొచ్చాయి. ఈసారి ముందుగానే సర్వే కూడా పూర్తి చేయాలని అనుకున్నట్లు తెలిసింది. దీనిపై ఇంతకుముందు చేసిన అనుభవం ఉండటంతో ఈసారి ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ఉండేలా చూస్తున్నారు. దరఖాస్తులు తీసుకున్న తరువాత వాటిని సర్వేచేసి ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేయనున్నారు. 9.3 దరఖాస్తులు, 9.14 అగ్రిమెంటు ఫారాలను తీసుకోవాలని నిర్ణయించారు. 9.3 తీసుకునే సమయంలో అందరికీ రసీదులు ఇవ్వాలా లేక 9.14 చేసుకున్న తరువాత ఇవ్వాలా అనే అంశంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. వీటితోపాటు పూలింగుకు భూములిచ్చిన రైతుల బ్యాంకు అకౌంట్లు.. ఆధార్ లింకు అంశాలను తనిఖీ చేయాలని నిర్ణయించారు. గతంలో జరిగిన పొరపాట్లు వల్ల చాలా వరకూ పదేపదే తనిఖీలు చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం జరగబోయే పూలింగులో ఇటువంటి ఇబ్బందులేవీ తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యతను ఎస్‌డిసిలకు అప్పగించారు. రెండోదశ పూలింగులో పెదపరిమి రెవెన్యూలో రెండు, వడ్డమాను, వైకుంఠపురం, హరిశ్చంద్రాపురం, పెదమద్దూరు, చావపాడు, యండ్రాయి, కర్లపూడి–లేమ్లలెలో మొత్తం తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. అయితే ప్రభుత్వం చెప్పినట్లుగా క్షేత్రస్థాయిలో జరగడం లేదన్న ఆరోపణలను మంత్రి నారాయణ పట్టించుకోవడం లేదు. కేంద్రమంత్రి పెమ్మసాని కూడా రైతుల ప్లాట్ల సమస్యలను పట్టించుకోవాలని కోరుతున్నారు.

# జమ్మూ కశ్మీర్ లో గ్రామ రక్షణ దళాలు..ఆర్మీ ట్రైనింగ్

జమ్మూ కశ్మీర్ : టెర్రరిజం సమస్యలతో సతమతమవుతున్న జమ్మూ కశ్మీర్ వాసుల సంరక్షణకు ఇండియన్ ఆర్మీ వినూత్న కార్యక్రమం చేపట్టింది. సరిహద్దు గ్రామాల్లో టెర్రరిస్టు దాడులను ఎదుర్కొనేందుకు స్థానికులకు సాయుధ శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగాభారత సైన్యం జమ్మూ కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో గ్రామ రక్షణ దళాలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆయుధాల వాడకం, ఆత్మరక్షణ, ప్రాథమిక పోరాట నైపుణ్యాలపై స్థానికులకు శిక్షణ ఇస్తున్నారు. 17 గ్రామాలకు చెందిన సుమారు 150 మంది వాలంటీర్లు ఆయుధాల నిర్వహణ, ఆత్మరక్షణలో శిక్షణ పొందుతున్నారు. గ్రామ రక్షణ దళాలకు వారి గ్రామాలను పర్యవేక్షించడం, రక్షించుకోవడంలో అవసరమైన సాయుధ నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. కొండలు, లోయల ప్రాంతాలలో శత్రువులు దాడులను ఎదుర్కోవడంలో అనుసరించాల్సిన పోరాట ఎత్తుగడలపై వారికి తర్ఫీదు ఇస్తున్నారు. రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కాశ్మీర్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్స్ గ్రూప్ ద్వారా గ్రామస్తులకు ఆటోమేటిక్ ఆయుధాలను నిర్వహించడం, బంకర్ల రక్షణ, ఎదురుదాడి చర్యలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న వారిలో పురుషులతో పాటు మహిళలు కూడా ఉన్నారు. ఇందుకు సంబంధించిన



ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. ఈ శిక్షణ స్థానిక గ్రామాల ప్రజల భద్రతను బలోపేతం చేస్తుందని, అనూహ్య దాడులను తిప్పికొట్టడంతో ఉపయోగపడుతుందని ఆర్మీ భావిస్తుంది. ఇదంతా తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్ల నుంచి రక్షణకు ఆనాడు గ్రామసంఘాలు కమ్యూనిస్టుల యోధుల ద్వారా పొందిన పోరాట శిక్షణను తలిపించేలా ఉండటం విశేషం.

# బనకచర్ల ప్రాజెక్టు నిర్మించుకుంటే తప్పేంటి?



రాజమహేంద్రవరం,గోదావరిపై దిగువ రాష్ట్రంగా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించుకుంటే తప్పేంటని మాజీమంత్రి తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇది వృధా జలాలను వాడుకోవడం తప్ప మరోటి కాదన్నారు. అధికారంలో లేనప్పుడు చంద్రబాబుపై విమర్శలు చేయడం కేసీఆర్‌కు అలవాటన్నారు. ఆయన నాకంటే జూనియర్. కేసీఆర్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల అవినీతిపై విచారణ జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలను కేసీఆర్, జగన్ పరిష్కారం కానివ్వలేదని అన్నారు. కలసి నడుద్దామని చెప్పిన వారే ఇప్పుడు కయ్యాలకు కాలుదువ్వుతున్నారని మండిపడ్డారు. వృధా జలాల విషయంలో ఎపికే హక్కులు ఉంటాయని అన్నారు. ఇదిలావుంటే ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. అవమానాలు ఎదురైనా కూటమి కొనసాగుతుందని బుచ్చయ్య చౌదరిఅన్నారు. ముందుచూపు గల సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అర్థం చేసుకున్నారని చెప్పారు. సినీ పరిశ్రమకు చెందిన వాళ్లతో ఆయన్ను రెచ్చగొట్టాలని వైకాపా చూస్తోందన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదు. జగన్ నియంత. తెలుగు యూనివర్సిటీ సమస్యను ఇటీవల పరిష్కరించాం. వైకాపా నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ నోరు అదుపులో పెట్టుకోవాలని గతంలోనే చెప్పేవాడిని. నా మాట విననందుకు ఇప్పుడు వాళ్లు ఫలితం అనుభవిస్తున్నారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు.

# యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ



హైదరాబాద్,రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఏ.పీ మరియు కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్‌కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు. మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఊప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

### అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర

హన్మకొండ,మినీ మేడారంగా పేరొందిన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో సమ్మక్క–సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అగ్రంపహాడ్‌లో సమ్మక్క–సారలమ్మను ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com